రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్



వార్త

పరీక్షా కేంద్రాలను సందర్శిస్తున్న కలెక్టర్ సి.నారాయణరెడ్డి

తొలి రోజు ప్రశాంతం

టెన్త్ పరీక్షా కేంద్రాలలో విస్తృత తనిఖీలు

రంగారెడ్డి అర్బన్, మార్చి14, ప్రభాతవార్త: జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి తెలిపారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. శనివారం మొదటి రోజు గచ్చిబౌలిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణ సరళిని పరిశీలించి విధులు నిర్వర్తిస్తున్న అధికారులతో మాట్లాడారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు తాగునీరు, ప్రథమ చికిత్స మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. అలాగే తరగతి గదుల్లో తగిన వెంటిలేషన్ ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యుత్ అంతరాయం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పరీక్షల సమయంలో ఎక్కడా ఎలాంటి చిన్న తప్పిదానికి అవకాశం ఇవ్వకుండా అధికారులు జాగ్రత్తగా వ్యవహరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో వసతులపై అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.

జంబ్లింగ్ పద్ధతిలోనే పరీక్షా కేంద్రాలు : డిఇఓ విజయకుమారి

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మార్చి 14, ప్రభాతవార్త : పదవతరగతి పరీక్షల రాసే విద్యార్థులను పరీక్షా కేంద్రాలకు జంబ్లింగ్ పద్దతిలోనే సాఫ్ట్‌వేర్ సహకారంతో కేటాయింపుల జరిగినట్లు మేడ్చల్ జిల్లా విద్యా అధికారి విజయకుమారి పేర్కొన్నారు. శనివారం పదవతరగతి పరీక్షలు ప్రారంభమైనాయి. జిల్లా వ్యాప్తంగా 237పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. పాఠశాలల విద్యార్థులకు జోన్‌ల వారీగ పరీక్షా కేంద్రాలకు కేటాయింపులు సంచాలకులు పరీక్షల విభాగం తెలంగాణ హైదరాబాద్ వారిచే జరిగినట్లు తెలిపారు. అయితే మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని న్యూ ఎరా పాఠశాల యందు 337మంది విద్యార్థులు పదవతరగతి పరీక్షలకు హాజరు అవుతున్నట్లు తెలిపారు. ఈ జోన్ పరిధిలో మొత్తం 4సెంటర్లను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. మొత్తం 17పాఠశాలలకు చెందిన 857మంది విద్యార్థులను కేటాయించటం జరిగిందన్నారు. జంబ్లింగ్ విధానంలో ఈ పాఠశాలకు చెందిన 81మంది విద్యార్థులు ఇదే పాఠశాలకు కేటాయించబడినట్లు తెలిపారు. ఈ పాఠశాల పరీక్ష కేంద్రంలో ఈ పాఠశాల విద్యార్థులను ఒకే చోట కాకుండ జంబ్లింగ్ పద్దతిలో సాఫ్ట్‌వేర్ ద్వారా కేటాయించబడినట్లు తెలిపారు. వీరు అందరు ఒకే చోట పరీక్షలు రాయటం లేదని డిఇఓ అన్నారు. ఈ పరీక్షా కేంద్రానికి ఈ పాఠశాల సిబ్బందిని కాకుండ పూర్తిగ ప్రభుత్వ ఉపాధ్యాయులచే మాత్రమే పరీక్షల నిర్వాహణకు కేటాయించబడినట్లు తెలిపారు. నలుగురు సిట్టింగ్ స్క్వాడ్‌ను రెవెన్యూ శాఖ సిబ్బందిని నియమించటం జరిగిందన్నారు. ఎలాంటి అవకతవకలకు తావులేకుండ పూర్తిగ పారదర్శకంగ పకడ్బంధీగ ఈ పరీక్షా కేంద్రంలో పరీక్షలను నిర్వహించటం జరుగుతుందన్నారు. పరీక్షలకు హాజరుగు విద్యార్థులు ఎలాంటి అపోహాలకు పోకుండా పరీక్షలకు హాజరు కావాలని జిల్లా డిఇఓ విజయకుమారి కోరారు.

ఆ పాఠశాల విద్యార్థులకు అక్కడే పరీక్షలా!

..అయితే మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని న్యూ ఎరా స్కూల్‌కు చెందిన పదవతరగతి విద్యార్థులు అదే ఆ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో ఎలా పరీక్షలు రాస్తారని పలు విద్యార్థి సంఘాలు విమర్శించారు. ఈ విషయం సోషల్ మీడియాలో, ఆ నోటా ఈ నోటా అంతటా వైరల్‌గా మారటం, ఈ విషయంపై విద్యార్థి సంఘాల వారు ఆరోపిస్తున్నారు. ప్రైవేట్ స్కూల్ యాజమాన్యంతో సంబంధిత విద్యా అధికారులు కుమ్మక్కు కావటం వల్లనే అదే పాఠశాల విద్యార్థులు అదే పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో పరీక్షలు రాసే పరిస్థితి ఏర్పడిందని పలు విద్యార్థి సంఘాల వారు ఆరోపిస్తున్నారు. అయితే దీనిపై డిఇఓ మాత్రం జంబ్లింగ్ విధానంలోనే కేటాయింపులు జరిగి పరీక్షలు విద్యార్థులు రాస్తున్నారని, ఈ జోన్ పరిధిలో నాలుగు సిట్టింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేయటం జరిగిందని, ప్రభుత్వ ఉపాధ్యాయులను పరీక్షల నిర్వాహణకు ఏర్పాటు చేయటం జరిగినట్లు డిఇఓ పేర్కొనటం జరిగింది.

99.76శాతం రెగ్యులర్ విద్యార్థుల హాజరు

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో పదవతరగతి పరీక్షలకు 99.76శాతం మంది రెగ్యులర్ విద్యార్థులు హాజరు కాగా, 77.64 శాతం ప్రైవేట్ విద్యార్థులు పరీక్షలకు హాజరు అయినట్లు మేడ్చల్ జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి పేర్కొన్నారు. శనివారం జిల్లా వ్యాప్తంగా 237పరీక్షా కేంద్రాల్లో పదవతరగతి పరీక్షలు ప్రారంభమైనాయి.

మొయినాబాద్ ఫామ్ హౌస్‌లో కాల్పుల కలకలం

మొయినాబాద్, మార్చి 14, ప్రభాతవార్త : ఫామ్ హౌస్‌లో డ్రగ్స్ పార్టీ జరుగుతున్నట్టు సమాచారం మేరకు పోలీసులు దాడిచేశారు. మాజీ ఎమ్మెల్యేకు చెందిన ఫామ్ హౌస్‌గా గుర్తించారు. డ్రగ్స్ తీసుకున్న ఎనిమిది మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రివాల్వర్, కొకైన్ స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ పార్టీ చేసుకుంటూ యువకులు ఫైర్ ఓపెన్ చేసినట్లు తెలుస్తోంది. సోదాలకు వెళ్లిన ఈగల్ టీమ్‌ను అడ్డుకుని అక్కడి యువకులు హంగామా చేశారు. డ్రగ్ పార్టీలో కనిపించిన డ్రగ్స్‌ను కూడా ఈగల్ టీమ్ స్వాధీనం చేసుకున్నారు. పార్టీలో పలువురు రాజకీయ నేతలు కూడా ఉన్నట్లు సమాచారం. ఓ ప్రజాప్రతినిధితో పాటు 8 వీఐపీలు, ఓ మాజీ ఎమ్మెల్యేను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారినుంచి యూరిన్ పరీక్షలుచేసి డ్రగ్స్ తీసుకున్నదీ లేనిదీ నిర్ధారించేందుకు ప్రయత్నిస్తున్నారు. అసలు కాల్పులు ఎందుకు జరిగాయి? ఎవరు ప్రధాన బాధ్యులలు అనే అంశంపై పోలీసులు దర్యాప్తుచేస్తున్నారు.

సిలిండర్ ₹1600

షాద్‌నగర్‌లో సామాన్యుడి నెత్తిన బండ

సిలిండర్ ధరలకు రెక్కలు

గ్యాస్ కొరత పేరుతో అక్రమ వసూళ్లకు గేట్లు

హోటల్, దాబా యజమానులతో బేరసారాలు

షాద్‌నగర్, మార్చి 14, ప్రభాతవార్త : జిల్లాలో గ్యాస్ కొరత లేదు.. ఎలాంటి ఇబ్బందులు లేవు.. అపోహాలు నమ్మవద్దు.. ఇది సాక్షాత్తు జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి చెప్తున్న మాట.. కానీ వాస్తవ పరిస్థితి అందుకు పూర్తిగా విరుద్ధంగా ఉంది.. షాద్‌నగర్ పరిధిలో గ్యాస్ కొరత పేరుతో గృహ వినియోగదారులకు చుక్కలు చూపిస్తున్నారు. అందాల్సిన సిలిండర్లు పక్క దారిలో వ్యాపార సంస్థల వద్దకు చేరుతున్నాయి.

ఇరాన్ ఇజ్రాయిల్ యుద్ధం మొదలైనప్పటి నుంచి కమర్షియల్ సిలిండర్‌లకు తీవ్ర కొరత ఏర్పడిందనేది అందరికీ తెలిసిన వాస్తవం. ఈ నేపథ్యంలో ముఖ్యంగా హోటళ్లు, దాబాలు పూర్తిగా మూతపడే పరిస్థితి ఏర్పడింది. దీంతో ఎలాగైనా సిలిండర్లు దక్కించుకోవటానికి గ్యాస్ ఏజెన్సీలను హోటల్, దాబా యజమానులు లైన్‌లో పెట్టారు. ఇదే అదునుగా ఏజెన్సీల నిర్వాహకులు వారితో బేరానికి తెరలేపారు. ఈ క్రమంలో రూ.950 ఉన్న సిలిండర్‌ను రూ.1600కు పెంచారు. దీనిపై గృహ వినియోగదారుల నుంచి పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నా.. దీనిని పెద్దగా ఎవరూ పట్టించుకోవడం లేదు. అయితే బ్లాక్‌లో వీటిని హోటళ్లకు అమ్ముకోవడం అలవాటుపడ్డ నిర్వాహకులు కృత్రిమ కొరత సృష్టిస్తూ వినియోగదారులకు గ్యాస్ లేదని చెబుతున్నారు. కొంతమంది డైరెక్టుగా గ్యాస్ కొరత ఉన్నందున ఇప్పుడే ఎవరు బుక్ చేసుకోవద్దని ప్రకటనలు కూడా చేస్తున్నారు. ఇక ఇక్కడ పరిస్థితి ఇలా ఉంటే..

తాజాగా జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి ఒక ప్రకటనను విడుదల చేశారు. జిల్లాలో ఎక్కడ కూడా గ్యాస్ కొరత లేదని, దీనిపై జరుగుతున్న ప్రచారంలో, వస్తున్న వదంతులలో వాస్తవం లేదని స్పష్టం చేశారు. దీనిపై జిల్లా ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, జిల్లాలో సరిపడా గ్యాస్ నిల్వలు ఉన్నాయని పేర్కొన్నారు. ఎప్పటిలాగే యథావిధిగా గ్యాస్ సరఫరా ఉంటుందని స్పష్టంచేశారు. కానీ వాస్తవ పరిస్థితి ఇందుకు పూర్తి విరుద్ధంగా ఉంది.

ఈ నేపథ్యంలో గృహ వినియోగదారులు అయోమయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. కలెక్టర్ అధికార యంత్రాంగాన్ని రంగంలోకి దించి ఈ కృత్రిమ కొరతను అరికట్టాలని, గృహ వినియోగదారులకు గ్యాస్ కొరత లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

గ్యాస్ గోదాంలను తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

కృత్రిమ కొరత సృష్టిస్తే ఖబడ్దార్

ప్రత్యేక తనిఖీలు నిర్వహించండి : పోలీసులు, రవాణా శాఖ అధికారులకు అదనపు కలెక్టర్ ఆదేశం

రంగారెడ్డి అర్బన్, మార్చి14, ప్రభాతవార్త: జిల్లాలో గృహ అవసరాలకు వినియోగించే ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరత లేదని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి తెలిపారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని, జిల్లాలో సరిపడా గ్యాస్ నిల్వలు ఉన్నాయని, ఎప్పటిలాగానే యథావిధిగా సరఫరా కొనసాగుతుందని స్పష్టం చేశారు. శనివారం పలు తహసీల్దార్ కార్యాలయంలో జిల్లాలో గ్యాస్ సరఫరా పరిస్థితిపై పోలీసు, పౌరసరఫరాలు, రవాణా, విద్య, ఆరోగ్య శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లాలో పరిస్థితులను అధికారులను అడిగి తెలుసుకుని తగిన సూచనలు చేశారు. ప్రజలకు గ్యాస్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ముఖ్యంగా ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలు, పాఠశాలల్లో గ్యాస్ సరఫరా లోపం రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఆస్పత్రుల్లో అత్యవసర పరిస్థితుల్లో గ్యాస్ అవసరాలపై వైద్యాధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని తెలిపారు. జిల్లాలో ఎవరైనా గ్యాస్ సిలిండర్లను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ కృత్రిమ కొరత సృష్టించే ప్రయత్నం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసులు, రవాణా శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగించినా చర్యలు తప్పవని పేర్కొన్నారు.

రాష్ట్ర పౌరసరఫరాలు, సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలో గ్యాస్ సరఫరాను పర్యవేక్షించేందుకు జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, జిల్లా పౌరసరఫరాల అధికారి కన్వీనర్‌గా 12 మంది సభ్యులతో డిస్ట్రిక్ట్ ఎనర్జీ సప్లై మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్యాస్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కమిటీ నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తుందని చెప్పారు. అనంతరం సరూర్‌నగర్‌లోని ఐశ్వర్య గ్యాస్ ఏజెన్సీ, వనస్థలిపురంలోని శ్రీనివాస్ గ్యాస్ ఏజెన్సీల గోదాములను అదనపు కలెక్టర్ తనిఖీ చేసి గ్యాస్ సరఫరా సజావుగా కొనసాగించాలన్నారు. ఈ సమావేశంలో కందుకూరు ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి వనజాత, జిల్లా వైద్యాధికారి లలితా దేవి, సంక్షేమ శాఖ అధికారులు రామరావు, రామేశ్వరీ దేవి, ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్లు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విపక్షంపై వివక్ష మానండి

ప్రజా సమస్యలు చెప్పడానికి కౌన్సిల్‌లో గొంతునొక్కేస్తున్నారు

ఏక పక్షంగానే నిర్ణయాలు తీసుకుంటారా?

వార్డుల అభివృద్ధిలో ఆయా సభ్యుల ప్రమేయం వద్దా?

వర్క్ ప్రపోజల్స్‌లో వారి భాగస్వామ్యం ఉండాల్సిందే

బడ్జెట్ సమావేశంలో ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి ధ్వజం

మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

షాద్‌నగర్, మార్చి 14, ప్రభాతవార్త : షాద్‌నగర్ మున్సిపాల్టీ తొలి కౌన్సిల్ సమావేశంలోనే ప్రొటోకాల్ రగడకు తెరలేచింది. శనివారం మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ (బస్వం) ఆధ్వర్యంలో జరిగిన బడ్జెట్ సమావేశానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా విపక్ష సభ్యులు తాము ఎదుర్కొంటున్న ప్రొటోకాల్ సమస్యను ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఎమ్మెల్సీ స్పందిస్తూ ప్రతి కౌన్సిలరూ ప్రజల చేత ఎన్నికైన వారేనని, వార్డులో ఉన్న సమస్యల పట్ల పూర్తి అవగాహన ఆయా సభ్యులకు మాత్రమే ఉంటుందని పేర్కొన్నారు. వారి వార్డులో ఉన్న సమస్యలకు సంబంధించిన పనులు చేయడానికి ప్రపోజల్స్‌ను ఇతరులతో తీసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ విధమైన ధోరణి సభ్యులను అవమానించినట్టే అవుతుందని అన్నారు. ఇకమీదట వార్డులో జరిగే ఎటువంటి అభివృద్ధి పనికి అయినా.. గౌరవ సభ్యుల నుండి మాత్రమే వర్క్ ప్రపోజల్ తీసుకోవాలని కోరారు. ప్రొటోకాల్ ఉల్లంఘన జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత కమిషనర్‌పైనే ఉందని స్పష్టంచేశారు. ప్రజాప్రతినిధులకు వారు ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేయడానికి సభలో అవకాశం ఇవ్వకపోవడం తగదన్నారు. సభ్యులందరికీ మైక్ కేటాయించేలా చూడాలని సూచించారు.

ప్రతిపక్ష సభ్యులకు మెక్ ఇవ్వకుండా సమావేశం అయిపోయిందని ఎమ్మెల్యే, చైర్మన్‌లు సభను ముగించడం సభా సంప్రదాయం కాదని బిఆర్ఎస్ కౌన్సిలర్లు నందారం అశోక్ యాదవ్, ఎస్పీ శివ తదితరులు పేర్కొన్నారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఓవైపు ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డిని అవమానించారని, మరోవైపు తమకు కూడా ప్రాధాన్యత లేకుండా చేశారని ఆరోపించారు.

ఇలాంటి పరిస్థితులపై అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్సిన అవసరం ఉందన్నారు. ఇకపై జరిగే కౌన్సిల్ సమావేశాలలో టిఆర్ఎస్ కౌన్సిలర్లు కూడా ప్రశ్నించక తప్పదని పేర్కొన్నారు. బడ్జెట్ విషయంలో సభ్యుల సూచన సలహాలు లేకుండా ఏకపక్షంగా సిద్ధం చేయడం సరికాదని పేర్కొన్నారు. ఎమ్మెల్సీకి కూడా మైక్ ఇవ్వకపోవడం చాలా దారుణమని, ఇలా అవమానించడం సరికాదని, ఇలా చేస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్‌లు, అధికారులు పాల్గొన్నారు.

మీడియాను ఎందుకు విస్మరించారు?

మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలకు మీడియాను ఎందుకు పిలవలేదని 16వ వార్డు కౌన్సిలర్ ఒగ్గు జయలక్ష్మి ౣ కిషోర్ అధికా రులను నిగ్గదీశారు. ప్రజా సమ్యలపై చర్చించే వేదిక అయిన కౌన్సిల్‌లో ఇక్కడి విషయాలు ప్రజలకు తెలియాల్సిన అవసరం లేదా? అని ప్రశ్నించారు.

అంతా అబద్ధం

మాట్లాడమని చెప్పినా నోరు విప్పలేదు

రాజకీయ విమర్శలు ఆపి పట్టణ అభివృద్ధికి కలిసి రండి

మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్

షాద్‌నగర్, మార్చి 14, ప్రభాతవార్త : గత పదేళ్లలో షాద్‌నగర్ పట్టణ అభివృద్ధి ఎంతో వెనుకబడిందని ఇప్పుడిప్పుడే నూతన పాలకవర్గం బాధ్యతలు చేపట్టి బాధ్యతాయుతంగా అభివృద్ధి చేసే దిశగా ముందుకు సాగుతుంటే ఆదిలోనే హంస పాదులా పాలకవర్గంపై విమర్శలు గుప్పించడం ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డికి తగదని షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ పేర్కొన్నారు. శనివారం జరిగిన మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో ఎమ్మెల్సీ చేసిన విమర్శలపై ఆయన స్పందించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. అభివృద్ధి విషయాలు మానుకొని వృధాగా విమర్శలు చేయడం సరికాదన్నారు. ఎమ్మెల్యేతో పాటు కౌన్సిలర్లు ఎవరి అభిప్రాయాలు వారు సమావేశం ద్వారా వ్యక్తపరిచారని, ఇంకా ఎవరైనా మాట్లాడే వారు ఉంటే మాట్లాడవచ్చని కూడా తాను చెప్పినట్లు గుర్తు చేశారు. ఎవరు మాట్లాడకపోవడంతో సమావేశం ముగిసిందని చెప్పామని పేర్కొన్నారు. ముగిసిన సమావేశం తర్వాత మాట్లాడే అవకాశం ఇవ్వలేదని రాజకీయ ప్రయోజనం కోసం వెంపర్లాడటం సరికాదని పేర్కొన్నారు. సమావేశాల్లో అందరు సభ్యులు మాట్లాడే విధంగానే అవకాశం కల్పించామని మాట్లాడిన వారు తమ అభిప్రాయాలు నిరభ్యంతరంగా కౌన్సిల్ దృష్టికి తెచ్చారని, అధికారులు కూడా అందరికీ సహకరించారని పేర్కొన్నారు. సమావేశం జరుగుతున్నప్పుడే సభాధ్యక్ష స్థానంలో ఉన్న తనను అడిగితే మాట్లాడించేవాడినని.. ఎవరూ అడగలేదని, సమావేశం ముగిశాక వారికి మైక్ ఇవ్వలేదని చెప్పడం విడ్డూరంగా ఉందని చైర్మన్ బస్వం అన్నారు. ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి అనవసర విమర్శలు మానుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ అందేమోహన్ విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ కౌన్సిల్ బడ్జెట్ మొదటి సమావేశం విజయవంతం అయ్యిందని మోహన్ తెలిపారు. పాలకవర్గంపై బురదజల్లే విధంగా తనకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదన్న సాకుతో కౌన్సిల్ సమావేశాలను ప్రతిష్టపాలు చేసేందుకు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని తెలిపారు.

మునిసిపల్ సమావేశ దృశ్యం

కిడ్నాప్ కేసు నీరు గార్చారని.. సెల్ టవర్ ఎక్కి హల్‌చల్

- ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నం

-డిఎస్‌పి హామీతో దిగివచ్చిన యువకుడు

-మోమిన్‌పేట్‌లో కలకలం

వికారాబాద్/మోమిన్‌పేట్, ప్రభాతవార్త : తనకు పోలీసులు న్యాయం చేయడం లేదని, వెంటనే న్యాయం చేస్తే తప్పా సెల్ టవర్ దిగి రానని ఓ బాధితుడు సెల్ టవర్ ఎక్కి మొండికేసాడు. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మర్పల్లి మండలం సిరిపురం గ్రామానికి చెందిన మోహన్‌రెడ్డి అతని అక్క భర్త లేకపోవడంతో ఆమె బిడ్డ సంరక్షణ బాధ్యత మోహన్‌రెడ్డి తీసుకున్నాడు. మోమిన్‌పేట్ మండల కేంద్రంలో గత కొంత కాలంగా కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. గత నెలలో మోహన్‌రెడ్డి కోడలును సిరిపురం గ్రామానికి చెందిన సందీప్‌రెడ్డి అనే యువకుడు కిడ్నాప్ చేశాడంటూ మోమిన్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మోహన్‌రెడ్డి కోడలు మైనర్ బాలిక కావడంతో పోలీసులు రంగంలోకి దిగి కేసు దర్యాప్తు చేపట్టారు. చివరకు మోహన్‌రెడ్డి కోడలు ఆచూకీ లభించింది. ఆమెను పిలిచి విచారించగా, తనను ఎవరూ బలవంతంగా తీసుకుపోలేరని వాంగ్మూలం ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు. దీంతో సందీప్‌రెడ్డిపై ఎలాంటి కేసు నమోదు కాకపోవడంతో..మోహన్‌రెడ్డి పోలీసుల తీరును తప్పు పట్టారు. సిరిపురం గ్రామానికి చెందిన సందీప్ రెడ్డి యే తన కోడలను ఎత్తుకెళ్ళాడని, అతనిపై ఫోక్సో కేసు నమోదు చేయాలంటూ పోలీసులను ప్రాదేయపడ్డాడు. దీంతో పోలీసులు నిరాకరించడంతో శనివారం సెల్ టవర్ ఎక్కి ఆత్మ హత్యా యత్నానికి సిద్ధపడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు, వికారాబాద్ డీఎస్పీ సంఘటన స్థలానికి చేరుకుని బాధితుడిని సముదాయించారు.

దాదాపు 3 గంటల పాటు సెల్ టవర్ పైనే ఉండి సెల్ ఫోన్లో వీడియోలు చిత్రీకరించి క్రింద ఉన్న అధికారులకు సమాచారం అందించాడు. వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి కలుగజేసుకుని, కేసు కు సంబంధించి పూర్తి విచారణ చేసి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో బాధిత యువకుడైన మోహన్‌రెడ్డి సెల్ టవర్ దిగి కిందకు వచ్చాడు. దీంతో అధికారులు బాధితునికి నచ్చ చెప్పి పంపించారు.

బ్యాంకును బురిడీ కొట్టించిన కేసులో ముగ్గురికి రిమాండ్

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 14, ప్రభాతవార్త: నకిలీ డ్యాకుమెంట్లు సృష్టించిన ప్లాట్ పత్రాలను బ్యాంకులో తాకట్టుపెట్టి రుణం పొంది ఆ డబ్బులను కాజేసిన ముగ్గురు కేటుగాళ్లను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సంఘటన వివరాలు స్థానిక పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పోచారం డివిజన్ కొర్రెముల శ్రీ రేణుకా ఎల్లమ్మ కాలనీకి చెందిన ఓ ప్లాటును నగరానికి చెందిన విశ్వనాథం అనే వ్యక్తి 1988లో 200 గజాల స్థలం గల ప్లాటు కొనుగోలు చేశాడు. కాగా ప్లాటు యాజమాని విశ్వనాథం 2010లో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న స్థానికంగా ఉన్న నవీన్ గౌడ్ ప్లాట్‌పై కన్నేసి తోటి స్నేహితులైన ఏదులాబాద్ డివిజన్‌కు చెందిన కె. సందీప్ రెడ్డి, సూర్యాపేట్ జిల్లా నేరేడుచర్లకు చెందిన జోసఫ్‌రెడ్డిలతో కలిసి ప్లాటుకు సంబంధించి నకిలీ డ్యాక్యుమెంట్లు సృష్టించారు. నకిలీ డ్యాకుమెంట్లతో 2021లో జోసెఫ్ రెడ్డి పేరున రిజిస్ట్రేషన్ చేశారు. ఇదే ప్లాటును 2024లో డ్యాకుమెంట్లు ఓ బ్యాంకులో తనఖాపెట్టి దాదాపు 20 లక్షలకుపైగా రుణం పొంది డబ్బులు ముగ్గురు సరిసమానంగా పంచుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇటీవల ప్లాటు ఒరిజినల్ యాజమాని విశ్వనాథం కూతురు కవిత కొర్రెములలోని తన తండ్రి కొనుగోలు చేసిన వద్దకు రాగా అసలు విషయం బయటకు వచ్చింది. దీంతో బాధితురాలు కవిత పోచారం ఐటీ కారిడార్ పోలీసులను ఆశ్రయించిన తనకు న్యాయం చేయాలని కోరగా పోలీసులు విచారణ చేపట్టినట్లు తెలిపారు. మిగతా 2లో

రేపటి నుంచి బ్రహ్మాండ నాయకుడి సంబురం

టిటిడి అర్చక బృందం అధ్వర్యంలో బ్రహ్మోత్సవాల నిర్వహణ

కొడంగల్, మార్చి 14, ప్రభాతవార్త: పేదల పెన్నిదిగా పేరుగాంచి రెండో తిరుపతిగా వెలుగొందుతూ భక్తుల ఇలవేల్పుగా వెలిసిన కొడంగల్ శ్రీమహాలక్ష్మీ వెంకటేశ్వరస్వామి 46వ వార్షిక బ్రహ్మో త్సవాలకు ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. తిరుమల తిరుపతి బ్రహ్మోత్సవాలను తలపించే తీరులో టీటీడీ అర్చక బృందం పర్యవేక్షణలో ఈనెల 16 నుంచి ప్రారంభమైయ్యే బ్రహ్మోత్సవాలు ఈనెల 24వ తేది వరకు 9 రోజుల పాటు భక్తుల గోవింద నామస్మరణతో మారుమ్రోగుతు అంగరంగ వైభవంగా కొనసాగుతాయి. బ్రహ్మోత్సవాల్లో రోజుకో వాహనంపై శ్రీవారు ఊరేగుతు భక్తులకు దర్శన భాగ్యం కల్పించనున్నారు. తిరుపతి వెళ్ళేందుకు ఆర్థిక స్థోమత లేని భక్తులకు ఇదోక వరం. భక్తుని కోరిక మేరకు ఏడుకొండలు దిగి వచ్చి కొడంగల్‌లో కొలువుదీరిన శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయం రెండో తిరుపతి పుణ్యక్షేత్రంగా విరాసిల్లుతుంది. ప్రసిద్దిగాంచిన అనేక ఆలయాలు ఆదరణకు నోచుకోక శిధిలావస్థలో ఉంటే వాటితో సరితూగే ఆలయాన్ని నిర్మించడం దేవునిపై ఓ భక్తుడికి ఉన్న అపారమైన భక్తికి నిదర్శనం.



టిటిడి నుంచి శేష వస్త్రాలు తీసుకువస్తున్న ఈఓ లోకనాథం

సిఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో రూ.110కోట్లతో నూతన ఆలయ నిర్మాణం

కొడంగల్ పట్టణంలోని శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వర దేవాలయంలో టీటీడీ తరహాలో వైఖనాస ఆగమ ప్రకారం నిత్య కైంకర్యాలు కొనసాగుతాయి. కాగా ఆలయం పురాతన కావడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో రూ.110 కోట్లతో నూతన ఆలయ నిర్మాణానికి పనులు ప్రారంభమైయ్యాయి. అందులో భాగంగా ఆలయం చుట్టు నివాసముంటున్న ఇళ్ళను మిగతా 2లో

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న నేతలు

సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

కుల్కచర్ల, మార్చి 14 ప్రభాతవార్త : సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని డిసిసి ఉపాధ్యక్షులు భీంరెడ్డి, అన్నారు. మండల కేంద్రంలోని సిమ పూజ శ్రీనివాస్ ఆనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందారు. వారికి ప్రభుత్వం నుండి మంజూరు కావడంతో స్థానిక నాయకుతో కలిసి చెక్కులను అందజేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తుందని అన్నారు. ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం విద్యా, వైద్యంకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజి ఎంపిటిసి ఆనందం, వార్డు సభ్యులు వెంకటేష్, సినియర్ నాయకులు వెంకటయ్య గౌడ్, రాంరెడ్డి, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి బ్రహ్మాండ నాయకుడి సంబురం

(మొదటి పేజీ తరువాయి)

ఖాళీ చేయించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.సుమారు 6 ఎకరాల్లో ఆలయం నిర్మాణం చేపట్టనున్నారు.అంతవరకు బాలాలయంలోనే శ్రీవారి బ్రోహ్మత్స వాలు కొనసాగుతాయని ఆలయ ధర్మకర్తలు తెలిపారు.

వైభవంగా కొనసాగనున్న శ్రీవారి 46వ వార్శిక బ్రహ్మోత్స వాలు :

శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి 46వ బ్రహ్మోత్స వాలు ఈనెల 16 నుంచి ఈనెల 24 తేది వరకు అంగరంగ వైభవంగా కొనసాగన్నాయి.తిరుమల తిరుపతి బ్రహ్మోత్స వాలను తలపించే మాదిరిగా టీటీడీ అర్చక బృంధం ఆధ్వర్యంలో నిర్వహించడం ఇక్కడి ప్రత్యేకత.16న తిరుచ్చి ఉత్స వం,రాత్రికి పెద్ద శేష వాహనం,17న చిన్న శేష వాహనం రాత్రికి హంస వాహనము,18న ఉదయం సింహ వాహనం,రాత్రికి వ్యాళి వాహనం,19న కల్ప వృక్ష వాహనం,సర్వభూపాల వాహనం,ఉగాధి ఆస్తానం,20న పల్లకిలో మోహనీ అవతార ఉత్స వం,రాత్రికి టీటీడీ శేషవస్త్రముల సమర్పణతో గరుడోత్స వము (లంకాదహనము)21న హనుమంత వాహనము,రాత్రికి గజవాహనము,22న సూర్యప్రభ వాహనము,రాత్రికి చంద్రప్రభ వాహనము,23న రథోత్స వం, అశ్వావాహనము ,24న రోహిణీ ఆస్దానంతో బ్రహ్మోత్స వాలు ముగుస్తాయి.ఉత్స వాలకు హైద్రాబాద్,రంగారెడ్డి,కర్నాటకలోని గుల్బర్గ,యాద్గిర్,రాయిచూర్,షోలాపూర్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తమతమ మొక్కులను తీర్చుకుంటారు.

ఆలయంలో ప్రతిష్టించిన మూలవిరాట్ :

తిరుమల తిరుపతి దేవస్దానంలో మాదిరిగానే ఇక్కడి ఆలయంలో ప్రతిష్టించిన మూలవిరాట్‌ను చూసిన భక్తులు స్వయంగా ఏడు కొండలపై కొలువుదీరిన శ్రీవెంకటేశ్వర స్వామిని చూసినంత అనుభూతికి లోనవుతారు.

స్వామివారి నిత్యపూజ కార్యక్రమాలు:

ఆలయంలో నిత్యం ఏదో పూజా కార్యక్రమాలు జరుగుతునే ఉంటాయి.రోజు ఉదయం 5గంటల ప్రాంతంలో సుప్రభాతం, విశ్వరూప దర్శనం, స్వామి వారిశుద్ధి,తోమాలసేవ,సహస్రనామార్చన తదితర పూజా కార్యక్రమాలు రాత్రి 8గంటల వరకు కొనసాగుతాయి.

బాలాజీ పాడుతా తీయగా:

వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్స వాల్లో భాగంగా ప్రతి రోజు రాత్రి స్వామివారి ఊయ్యాల సేవ కార్యక్రమంలో నిర్వహించే బాలాజీ పాడుతా తీయగా కార్యక్రమం ప్రత్యేక ఆకర్శణగా నిలుస్తుంది.వివిధ పాఠశాలల విద్యార్థులు,చిన్నారులచే నిర్వహించే నృత్యాలు,భక్తి గీతాలు తదితర కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటాయి.అదే సమయంలో నెల్లూరు వారి నాదస్వర బృంధంచే నిర్వహించే గానకచేరీ విశేష ఆకర్శణగా నిలుస్తుంది .స్వామివారి ఊయ్యాల సేవలో నాదస్వర బృంధంచే నిర్వహించే భక్తి గేయాలు భక్తులను ఉర్రుతలూగిస్తుంది.

కొడంగల్ శ్రీవారికి టీటీడీ శేష వస్త్రాల సమర్పణ:

కొడంగల్ శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్స వాలను పురస్కరించుకొని టీటీడీ తరఫున శేష వస్త్రాలు సమర్పించారు.తిరుమల తిరుపతి దేవస్తానం డిప్యూటీ ఈఓ లోకనాథం శనివారం కొడంగల్ శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి చేరుకొని శ్రీవారికి టీటీడీ పట్టు వస్త్రాలు సమర్పించారు.ఆలయ అర్చకులు టీటీడీ అధికారులకు వేద ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలను అందించారు.ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలు మున్సి పల్ చైర్మెన్ నందారం ప్రశాంత్ టీటీడీ ఈఓకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

ముగ్గురికి రిమాండ్

(మొదటి పేజీ తరువాయి)

విచారణలో ప్లాట్‌ను కాజేయడమే కాకుండా బ్యాంకులో ప్లాట్ పేపర్లు తాకట్టు పెట్టి రుణం పొందిన కె. సందీప్ రెడ్డి, నవీన్ గౌడ్, జోసెఫ్‌రెడ్డిలను అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోచారం ఐటీ కారిడార్ పోలీసులు తెలిపారు.

రంజాన్ ఏర్పాట్లపై దృష్టి పెట్టండి

మున్సిపల్ కమిషనర్‌కు ఎమ్మెల్యే ఆదేశం

షాద్‌నగర్ టౌన్, మార్చి 14, ప్రభాతవార్త : పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ముస్లింలు అత్యంత పవిత్రంగా జరుపుకునే రంజాన్ ప్రార్ధనకు సంబంధించి ఫరుక్ నగర్ ఈద్గా వద్ద ఏర్పాట్లను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్థానిక కౌన్సిలర్ నడికుడ శ్రావణి, మైనార్టీ నేతలతో కలిసి పరిశీలించారు. శనివారం ఉదయం స్థానిక మున్సిపల్ చైర్మన్ అగనూరు బసవేశ్వర్, మున్సిపల్ కమిషనర్ సునీతారెడ్డి పర్యవేక్షణలో ఈద్గా వద్ద పరిసరాలను పరిశీలించారు. రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలు నిర్వహించే ప్రత్యేక ప్రార్ధనల కోసం ఈ పరిసరాల్లో పారిశుధ్యం, మంచినీరు, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించాలని వారు కోరారు. రంజాన్ నాటికి పూర్తి ఏర్పాటు చేయాలని కౌన్సిలర్ శ్రావణి కమిషనర్ సునీత రెడ్డిలకు సూచించారు. ఈద్గా ప్రాంగణంలో హైమాక్స్ లైట్ ఏర్పాటుకు సహకరించాలని స్థానిక నేత జమృత్ ఖాన్ సూచించారు. ఈద్గా వద్ద మౌలిక సదుపాయాల రూపకల్పనకు స్థానిక మైనార్టీ నేత మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, జమ్రద్ ఖాన్ తదితరులు ఏర్పాట్లు చూసుకోవాలని ఎమ్మెల్యే వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నడికుడా శ్రావణి కమిషనర్ సునీత రెడ్డి, పెంటయ్య, మహ్మద్ అలీ ఖాన్ బాబర్ జమృత్ ఖాన్, ముబారక్ అలీఖాన్, తదితరులు పాల్గొన్నారు.

ఈద్గాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

ఆడబిడ్డ పెళ్లి భారం కాకూడదు

పేదల్లో ధైర్యం నింపటానికే కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్

రూ.1.60 కోట్ల చెక్కులు పంపిణీ సభలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, మార్చి 14, ప్రభాతవార్త : ఆడబిడ్డ పెళ్లి ఏ కుటుంబానికి భారం కాకూడదు... కన్నవారి కళ్లల్లో ఆనందం చూడటమే ప్రభుత్వ లక్ష్యమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం షాద్‌నగర్ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నియోజకవర్గంలోని ఫరూఖ్‌నగర్, కొందుర్గు, చౌదరిగూడ తదితర మండలాలకు చెందిన లబ్ధిదారులకు ఆయన స్వయంగా చెక్కులను అందజేశారు. ఈ సందర్బంగా నియోజకవర్గంలో మొత్తం 160 మంది లబ్ధిదారులకు రూ.1,60,18,560 విలువైన చెక్కులను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి పేదవాడికి అందాలన్నారు. పేద కుటుంబాల్లో ఆడబిడ్డల వివాహాలు సజావుగా సాగాలని ముఖ్యమంత్రి ఈ పథకాన్ని అత్యంత ప్రతిష్టాత్మంగా అమలు చేస్తున్నారని అన్నారు. ఇది కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదని, ఆ కుటుంబాలకు ప్రభుత్వం కల్పిస్తున్న ఒక గొప్ప భరోసా అని పేర్కొన్నారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకున్న వెంటనే త్వరితగతిన చెక్కులు అందేలా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ద వహించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ బస్వం, తహసీల్దార్ నాగయ్య, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ బాబర్‌ఖాన్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ విశ్వం, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి,

కళ్యాణ లక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

కౌన్సిలర్లు, అధికారులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు, నేతలు, వివిధ గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

లింగారెడ్డిగూడెంలో..

షాద్‌నగర్ టౌన్ : పేదింటి ఆడపడుచుల వివాహానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం అండగా నిలబడుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూక్ నగర్ మండలం లింగారెడ్డిగూడెం గ్రామంలో 5 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను శనివారం ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివాహం ప్రస్తుత తరుణంలో అత్యంత ఖరీదైనదిగా మారిందని, ఈ నేపథ్యంలోనే పేద మహిళలకు అండగా ఉండాలని ప్రభుత్వం నిర్ణయించిందని వెల్లడించారు. మండల పార్టీ అధ్యక్షుడు చల్ల శ్రీకాంత్ రెడ్డి, గ్రామ సర్పంచ్ ఎంపీ ప్రవీణ్ కుమార్, ఉపసర్పంచ్ ఎర్రోళ్ల అశోక్, వార్డు సభ్యులు మల్లేష్ యాదవ్, సాయిరాం, రంగంపల్లి రమేష్ గౌడ్, ఎర్రోళ్ల జంగయ్య, ఫకీర్ భాష, అరుణ్ కుమార్, లక్ష్మీ మకాంత్ రెడ్డి, ఖదీర్, పక్కనే చిన్న, నరసింహ, ఒక్కని శివ కార్యక్రమంలో పాల్గొన్నారు. లక్కీ దారులు అప్పన్న గారి శోభ, ఎర్రోళ్ల చంద్రకళ, పక్కనే అరుణ, అత్యం మాధవి, బొగురాం యాదమ్మ ఈ చెక్కులను అందుకున్నారు.

చిన్నారి ఆపరేషన్‌కు ఆర్థిక సాయం

షాద్‌నగర్ రూరల్, మార్చి 14, ప్రభాతవార్త : పుట్టుకతోనే వినికిడి సమస్యతో బాధపడుతున్న ఒక చిన్నారి ప్రాణాలను కాపాడేందుకు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మానవత్వంతో స్పందించారు. గంట్లవెల్లి గ్రామానికి చెందిన చిన్నారి యోధన్ చికిత్స నిమిత్తం మంజూరైన రూ.6లక్షల విలువైన ఎల్ఓసీ చెక్కును శనివారం చిన్నారి తండ్రి రాఘవేంద్రకుమార్‌కు ఎమ్మెల్యే అందజేశారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యా లయంలో నిర్వహించిన కళ్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ సందర్భంగా బాధిత కుటుంబానికి ఈ చెక్కును అందజేశారు. గంట్లవెల్లి గ్రామానికి చెందిన యోధన్ పుట్టుకతోనే చెవి సంబంధిత సమస్యలతో ఇబ్బంది పడుతున్నాడు. గతంలోనే ఒకసారి శస్త్రచికిత్స చెయించిన తల్లిదండ్రులు ప్రస్తుతం మరో సర్జరీ అవసరం కావడంతో ఆర్థిక ఇబ్బందుల వల్ల ఎమ్మెల్యేను ఆశ్రయించారు. చిన్నారి పరిస్థితిని చూసి చలించిపోయిన ఎమ్మెల్యే వెంటనే స్పందించి ప్రభుత్వ పక్షాన రూ.6లక్షల ఎల్ఓసీ మంజూరు చేయించారు. తమ బిడ్డ ప్రాణాలను కాపాడేందుకు ఇంత పెద్ద మొత్తంలో ఆర్థిక సాయం అందేలా కృషి చేసిన ఎమ్మెల్యే కు చిన్నారి తండ్రి రాఘవేంద్రకుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ఈ ప్రక్రియలో తమకు తోడుగా నిలిచిన గ్రామ సర్పంచి శివకుమార్‌యాదవ్‌కు, గ్రామపెద్దలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా సర్పంచ్ శివకుమార్ మాట్లాడుతూ... అడిగిన వెంటనే సానుకూలంగా స్పందించి, పేద కుటుంబానికి అండగా నిలిచినందుకు ఎమ్మెల్యేకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే చూపిస్తున్న చొరవ నియోజకవర్గ ప్రజలకు ఎంతో ధైర్యాన్ని ఇస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, మాజీ సర్పంచి యాదమ్మయాదయ్య, నేతలు బాల్‌రాజ్, అనీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఓసీ అందుకున్న చిన్నారి తండ్రి రాఘవేంద్రకుమార్ తదితరులు

ఫాంహౌస్‌ను ధ్వంసం చేశారని ఫిర్యాదు

చేవెళ్ల, మార్చి 14, ప్రభాతవార్త : ఆలూరు గ్రామ సర్పంచ్ భాగ్యమ్మ భర్త అయిన శేఖర్‌గౌడ్ ఆయన అనుచరులతో కలిసి తన వ్యవసాయ క్షేత్రాన్ని ధ్వంసం చేశారని సాయిమీరాకిల్ వ్యవసాయ క్షేత్రం యాజమాని చింతలపాటి హర్షిణి శనివారం చేవెళ్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 12 రాత్రి సుమారు 11.20 గంటలకు శేఖర్‌గౌడ్‌తో పాటు సమారు 10 మంది అనుచరులు తమ వ్యవసాయ క్షేత్రంలోకి అక్రమంగా ప్రవేశించారని చెప్పారు. బెదిరించడంతో పాటు దైర్జన్యం చేశారన్నారు. తమకు డబ్బులు ఇవ్వకుంటే మీ అంతు చూస్తామని బెదిరించారని ఫిర్యాదు చేశారు. వ్యవసాయం క్షేత్రాన్ని చూసేందుకు వచ్చామని చెప్పడంతో గేటు తీశామని తెలిపారు. 'మీ యాజమానిని కలువమని చెప్పు.. లేదంటే మొత్తం ధ్వంసం చేస్తాం' అని బెదిరించారని సెక్యురిటీ గార్డ్ వికాస్ ఫిర్యాదు చేశారు. యాజమానికి పోన్ చేసిన మాట్లాడుండగా తన ఫోన్‌ను తీసుకుని పగులగొట్టారని, అసభ్యకరమైన పదజాలంతో దూషిస్తూ బెదిరించి కొట్టారని, చంపుతామని బెదిరించారని వివరించారు. ఎక్కడి నుండొ వచ్చి మీరు ఇక్కడ భూములు కొంటుంటే చూస్తు ఊరుకుంటామా మాకు ఇవ్వాల్సిన డబ్బులు ఇచ్చి తీరాల్సిందే..లేదంటే మా తడఖా చూపిస్తామంటూ దుర్భాషలాడారన్నారు. దాడికి పాల్పడిన శేఖర్‌గౌడ్, అతని అనుచరులపై కఠినంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు. దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చేవెళ్ల పోలీసులు తెలిపారు.

సంస్కృతిని గౌరవిస్తేనే ఉత్తమ స్థానం

పెద్దేముల్, మార్చి 14, ప్రభాతవార్త: మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించడం ద్వారానే ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహిత, ప్రముఖ గణిత అవధాని కోకట్ అనంతయ్య అన్నారు. ఖాంజాపూర్ సమీపంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన గణిత అవధానం అవగాహన కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్బంగా అనంతయ్య మాట్లాడుతూ నేటి ఉరుకుల పరుగుల జీవితంలో తల్లిదండ్రులు తమ పిల్లల పెంపకంపై ప్రత్యేక శ్రద్ద వహించాలని అన్నారు. అంతేగాకుండా వారికి క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని అన్నారు. విద్యార్థులకు గణితంపై ఉన్న భయాన్ని పోగొట్టి సులభ పద్ధతుల్లో లెక్కలను ఎలా నేర్చుకోవాలో వివరించారు. అనంతరం ఆలయ కమిటి సభ్యులు అనంతయ్యను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు బిచ్చప్ప, క్రిష్ణయ్య, ఆంజనేయులు, రాంరెడ్డి, నర్సిములు, మొల్ల కళావేదిక పొందర్ అధ్యక్షులు కె.వెంకట్, నారాయణ, రఘు తదితరులు పాల్గొన్నారు. రాము చారి, ప్రవళిక దంపతులు భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు.

గణిత అవధాని అనంతయ్యను సన్మానిస్తున్న ఆలయ కమిటి సభ్యులు

పండుగలు సమాజంలో ఐక్యతకు దోహదం

నందిగామ, మార్చి 14, ప్రభాతవార్త : పవి త్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని నం దిగామ మాజీ వార్డు సభ్యుడు తుప్పుడు కృష్ణ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు నిర్వహించారు. స్థానిక ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ పండుగలు సోదర భావా న్ని ఐక్యతను చాటి చెబుతాయని, అందరూ కలిసిమెలిసి పండుగలను జరుపుకోవడం సంతోషదా యకమని పేర్కొన్నారు. ఈ కార్య క్రమంలో ముస్లింలు రహీం ఖాద్రి, ఫహీద్, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి యువసేనసభ్యులు పాల్గొన్నారు.

నందిగామలో ఇఫ్తార్ విందు నిర్వహిస్తున్న మాజీ వార్డు సభ్యుడు కృష్ణ

పర్యావరణ పరిరక్షణకు సహకరించండి

కుల్కచర్ల, మార్చి 14 ప్రభాతవార్త: వర్షకాలం నాటికి మొక్కలు సిద్ద కావాలని సర్పంచ్ దేవి దేవ్‌జ నాయక్ సూచించారు. శనివారం మండల పరిధిలోని చెరువుముందలి తాండ(కే) గ్రామ పంచాయతీలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆమె నర్సరి పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దేవి దేవ్‌జ నాయక్ మాట్లాడుతూ..పర్యావరణ పరిరక్షణకు, ఆహ్లాదకర వాతావరణం కోసం చెట్లను పెంచుతున్నట్లు చెప్పారు. ఈ బృహత్తర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. మండలంలోనే అదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతమని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్ గౌడ్, వార్డు సభ్యులు రాజు నాయక్, గ్రామ నాయనాకులు గోపాల్, బాష, పాండు, లాల్య,సోమ్ల, దేమ్ల, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ దేవి దేవ్‌జ నాయక్

షాద్‌నగర్‌ను ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతా

షాద్ నగర్ టౌన్, మార్చి 14, ప్రభాతవార్త : రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటీ పదో వార్డులో జానమ్మ చెరువు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్,మున్సిపల్ కమిషనర్ సునీత, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ బాబర్ అలీ ఖాన్, కౌన్సిలర్లు నడికుడా శ్రావణి, పెంటయ్య, మురళీమోహన్(అప్పి), దిలీప్, కొప్పునూరి ప్రవణ్, బచ్చలి నరేష్, గోపాల్, రాజు నాయక్, నేతలు జ్రుమద్ ఖాన్, ముబారక్ అలీ ఖాన్, జి టి శ్రీనివాస్,మాధవులు యాదవ్, జయప్రకాష్, శ్రీనివాస్ రెడ్డి బీరప్ప పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చేవెళ్ల, మార్చి 14, ప్రభాతవార్త:

ఆర్టీసి బస్ బైక్‌లు ఢీ కొట్టిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. చేవెళ్ల ఎస్ఐ సంతోష్‌రెడ్డి కథనం ప్రకారం హైదరాబాద్ నుండి వికారాబాద్‌కు వెళ్తున్న ఆర్టీసి బస్ నంబర్ టిసి09జడ్0443 గల బస్సు బైక్ నంబర్ ఎపి31బిఎక్స్5798ను చేవెళ్ల సమీపంలోని కేసారం గేట్ వద్ద ఢీ కొట్టడంతో బైక్‌పై వెళ్తున్న కర్ణాటక రాష్ట్రంకు చేందిన వాసంశెట్టి శ్రీను అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని చేవెళ్ల ఎస్ఐ సంతోష్‌రెడ్డి తెలిపారు.

ఆర్గానిక్ ఉత్పత్తులకు ప్రోత్సాహం అవసరం

- వార్త తెలుగు జాతీయ దినపత్రిక సిఎండి, మాజీ ఎంపి డాక్టర్ గిరీష్ కుమార్ సంఘీ

తార్నాక, మార్చి 14, ప్రభాతవార్త : ప్రజల ఆరోగ్యం, రైతుల ఆర్థికాభివృద్ధి మరియు ప్రకృతి పరిరక్షణకు ఆర్గానిక్ వ్యవ సాయం ఎంతో అవసరమని మాజీ రాజ్యసభ సభ్యులు, వార్త జాతీయ తెలుగు దిన పత్రిక ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ గిరీష్ కుమార్ సంఘీ అన్నారు. రైతులు పండించే ఆర్గానిక్ ఉత్పత్తులను ప్రజలకు నేరుగా అందించేలా వేదికలు ఏర్పాటు చేయడం మంచి పరిణామమని ఆయన పేర్కొన్నారు. గ్రామ భారతి ఆధ్వర్యంలో మూలం సంత పేరుతో తార్నాక మర్రి కృష్ణారెడ్డి హాల్లో నిర్వహించిన సంతను ఆయన సందర్శించారు. ఆర్గానిక్ ఉత్పత్తుల ప్రాధాన్యతపై, రైతులు పండించిన ఆహార పదార్థాలు, ఇతర వస్తువులను ఒకే వేదికపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని సంతలో ఉన్న స్టాళ్లను సందర్శించారు. మహిళలు, నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయనాల వినియోగం పెరగడం వల్ల నేటి కాలంలో అనేక రకాల ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని అన్నారు. అందువల్ల ప్రజలు ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అనుసరించడానికి ఆర్గానిక్ ఆహార పదార్థాలను వినియోగించడం చాలా అవసరమని సూచించారు. రైతులు సహజ పద్ధతుల్లో పండించే ధాన్యాలు, కూరగాయలు, పండ్లు, ఇతర ఆహార పదార్థాలు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని ఆయన వివరించారు. అలాంటి ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు అందించేలా ప్రత్యేకంగా సంతలు, మార్కెట్లు ఏర్పాటు చేయడం ద్వారా రైతులకు సరైన ధర లభించడంతో పాటు వినియోగదారులకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. రైతులు పండించిన వస్తువులను అమ్ముకునే విధంగా ఒక వేదికను ఏర్పాటు చేసి వారిని ప్రోత్సహించడం సమాజానికి చాలా ఉపయోగకరమని గిరీష్ కుమార్ అన్నారు.

సంతలతో రైతుల్లో ఆత్మవిశ్వాసం

ఈ విధమైన కార్యక్రమాలు రైతుల ఆత్మవిశ్వాసాన్ని పెంచడమే కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను కూడా బలోపేతం చేస్తాయని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం సమాజంలో ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెరుగుతున్న నేపథ్యంలో ఆర్గానిక్ ఉత్పత్తులకు డిమాండ్ రోజురోజుకు పెరుగుతోందని చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకొని సహజ వ్యవసాయాన్ని మరింత విస్తరించాలని ఆయన సూచించారు. అలాగే రైతులను ప్రోత్సహించడానికి ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు రావాలని గిరీష్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గిరీష్‌కుమార్ సంఘీ మూలం గ్రామ భారతి అధ్యక్షురాలు సూర్యకళను అభినందించారు.

అర్చన సామాగ్రిని రైతుల వద్ద నుంచే కొంటాం సామాజికవేత్త యమునా పాఠక్

అంతకు ముందు నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ సామాజికవేత్త యమునా పాఠక్ హాజరయ్యారై మాట్లాడుతూ తాను చేపట్టిన మన గుడి - మన బలం కార్యక్రమంలో భాగంగా దేవాలయాల్లో ధూపం, దీపం, నైవేద్యం కోసం అవసరమైన వస్తువులను మూలం సంతలోని రైతుల వద్ద నుంచే కొనుగోలు చేసేలా కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. అలాగే సక్సెస్ మంత్ర ఉదయశ్రీ పటేల్, సిఎస్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు హేమ, జ్యోతి పాల్గొన్నారు. సంతలో స్టాళ్ల నిర్వహిస్తున్న 60కి పైగా మహిళలను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్గానిక్ వ్యవసాయం అభివృద్ధి చెందితే రైతులకు మంచి ఆదాయం రావడంతో పాటు ప్రజల ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని వారు అభిప్రా యపడ్డారు ప్రతి ష్టాత్మకమైన గ్రామ భారతి నారీ శక్తి పురస్కారంను విజయా హెల్దీ ఫుడ్స్ అధినేత ఈగ విజయలక్ష్మి అందుకున్నారు. అలాగే మాస్టర్ చెఫ్ పోటీల్లో రెండవ విజేతగా నిలిచిన మంచిర్యాల జిల్లాకు చెందిన రైతు రాచకొండ చందన, ఆమె కుమార్తె రాచకొండ సాయి శ్రీలకు కూడా ప్రత్యేక సత్కారం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ భారతి అధ్యక్షులు సూర్యకళ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదగడానికి మూలం సంత వంటి కార్య క్రమాలు ఎంతో ఉపయోగ పడుతున్నాయని తెలిపారు. రైతుల ఉత్పత్తులకు సరైన వేదిక కల్పించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా వ్యాపారులు, రైతులు, గ్రామ భారతి కార్యకర్తలు, పలు వురు సామాజికవేత్తలు పాల్గొన్నారు.

గ్రామ భారతి మూలం సంతలో స్టాల్‌ను సందర్శిస్తున్న దృశ్యం

పంపిణీ చేస్తున్న ఎస్ఐ సున్నం రాఘవేందర్

టెన్త్ విద్యార్థులకు ఓఆర్ఎస్ డ్రింక్ పంపిణీ

ధారూర్, మార్చి 14, ప్రభాతవార్త: పరీక్షల ఒత్తిడితో పాటు భానుడి భగభగలతో ఇబ్బంది పడుతున్న విద్యార్థులకు ధారూర్ ఎస్ఐ సున్నం రాఘవేందర్ అండగా నిలిచారు. శనివారం మండల కేంద్రంలోని పరీక్ష కేంద్రం వద్ద పరీక్ష ముగించుకుని బయటకు వచ్చిన విద్యార్థులకు ఆయన ఓఆర్ఎస్ డ్రింక్ పంపిణీ చేశారు. ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉండటంతో పరీక్ష రాసి అలసిపోయిన విద్యార్థులు నీరసానికి గురయ్యే అవకాశం ఉందని భావించిన ఎస్ఐ, ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. పరీక్ష కేంద్రం గేటు వద్ద నిలబడి ప్రతి విద్యార్థికి చల్లని ఓఆర్ఎస్ డ్రింక్ ను అందజేస్తూ వారిని ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, విద్యార్థులు ఎండలో ప్రయాణించేటప్పుడు వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. పరీక్షల సమయంలో ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రమేష్ కుమార్

రహదారి భద్రతను బాధ్యతగా తీసుకోండి

కుల్కచర్ల, మార్చి 14, ప్రభాతవార్త: ప్రతి ఒక్కరూ రహదారి నిబంధనలు పాటించాలని ఎస్ఐ రమేష్ కుమార్ సూచించారు. శనివారం మండల కేంద్రం లోని వాహనాలను తనిఖీ చేశారు. రోడ్డు భద్రత నియమాలపై అవగాహన పెంచు కుంటే సురక్షిత ప్రయాణానికి ఆస్కారం ఉంటుందని తెలిపారు. రహదారి భద్రత అనేది ఒకరి బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. వేగ పరిమితులకు లోబడి డ్రైవింగ్ చేయాలని, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని, మద్యం సేవించి వాహనం నడపరాదని పేర్కొన్నారు. డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ మాట్లాడరాదన్నారు. వాహనాలను అజాగ్రత్తగా నడపడం వల్లే 90 శాతం ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.

నర్సరీని పరిశీలిస్తున్న సర్పంచ్

పచ్చని చెట్లు పల్లె ప్రగతికి మెట్లు

నందిగామ, మార్చి 14, ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ చంద్రాయన్ గూడ శివారులో ఉన్న నర్సరీని పరిశీలించారు. పర్యావరణ పరిరక్షణ కోసం నర్సరీలో పెంచుతున్న మొక్కల వివరాలను గ్రామ కార్యదర్శి మల్లికార్జున్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. మానవ మనుగడకు ప్రాణ వాయువు నుంచి మొక్కలను పెంచి సంరక్షి ం చాలని కోరారు. పచ్చని చెట్లు ప్రగతికి మెట్లన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెంకటేష్ గౌడ్, వార్డు సభ్యులు శివ గళ్ళ సురేష్, బొమ్మ గళ్ళ నర్సింలు, చించెటి శివ గౌడ్, నాయకులు నరేందర్ రెడ్డి, తడకల జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో కరెంటు కష్టాలు రాకూడదు

తాగునీటికి, సాగునీటికి ఆటంకంరాకుండా చూడండి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆదేశం

షాద్‌నగర్, మార్చి 14, ప్రభాతవార్త : వేసవిలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోనీ విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయంలో నియోజకవర్గ విద్యుత్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని ఎమ్మెల్యే వీళ్ళపల్లి శంకర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ సమీక్షకు హాజరైన పట్టణ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ వైస్ చైర్మన్ అందే మోహన్ తదితరులను విద్యుత్ శాఖ అధికారులు మర్యాద పూర్వకంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ విద్యుత్ శాఖ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ప్రజలకు వేసవికాలంలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని ఆయన కోరారు. విద్యుత్ సరఫరా పైననే మొత్తం ఆధారపడి ఉంటుందని నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని దీనికి సంబంధించిన అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. వేసవిలో విద్యుత్ కొరత లేకుండా చేయాలని ఆయన ఆదేశించారు. ముఖ్యంగా కరెంటు కొరతల వల్ల పంటలు ఎక్కడ ఎండిపోకూడదని తాగునీరు సాగునీటికి ఇబ్బంది రాకుండా యుద్ధ ప్రాతిపదికన అన్ని చర్యలు తీసుకోవాలని డిఈ శ్యాంసుందర్ రెడ్డి ద్వారా సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ వైస్ చైర్మన్ అందే మోహన్. ముదిరాజ్, అన్ని మండల పార్టీ అధ్యక్షుడులు శ్రీకాంత్ రెడ్డి గూడ వీరశం, హరినాథ్ రెడ్డి కొత్తూరు మున్సిపాలిటీ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్ మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశ్వం, నేతలు రఘు నాయక్, జ్రుమద్ ఖాన్ నర్సింహులుఅధికారులు పాల్గొన్నారు.

మెగా హెల్త్ క్యాంపును సద్వినియోగము చేసుకోండి

వైద్యాధికారిణి

కొందుర్గు, మార్చి 14, ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి నివేదిక 99 రోజుల కార్యక్రమం లో భాగంగా ఈనెల 17వ తేదీన స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో నిర్వహిస్తున్న మెగా హెల్త్ క్యాంపును ఉమ్మడి మండలాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రభుత్వ వైద్యాధికారిని అమృత జోసఫ్ కోరారు. ఈ శిబిరానికి గైనకాలజిస్ట్, ఆర్థోపెడిక్, డెంటిస్ట్, పీడి యాడిషన్. (చిన్నపిల్లల వైద్యులు), జనరల్ ఫిజీషియన్ డాక్టర్ల బృందం పాల్గొని ప్రజలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తారని డాక్టర్ వివరించారు. ఉమ్మడి మండలాల ప్రజా ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యుల సభ్యులు, అంగన్వాడి ఆశ వర్కర్లు, సర్పంచులు పంచాయతీ సభ్యులు ప్రజలను చైతన్యపరిచి శిబిరానికి వచ్చేలా ప్రోత్సహించాలని ఆమె కోరారు. ఉమ్మడి మండలాల ప్రజలు ప్రభుత్వం కల్పిస్తున్న ఈ వైద్య సేవల అవకాశాన్ని సద్వినియోగం చేసుకోని, ప్రభుత్వ ఆశయానికి అండగా నిలవాలని ఆమె కోరారు. వైద్య శిబిరానికి వచ్చే ప్రతి ఒక్కరు తమ ఆధార్ కార్డు తీసుకుని రావాలని ఆమె కోరారు.

రైతు భరోసా నిధులు ఎప్పుడు వేస్తారు ?

సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

జిల్లెడు చౌదరిగూడ,మార్చి 14,(ప్రభాతవార్త): తెలంగాణ ప్రభుత్వం రైతు భరోసా నిధులు ఎప్పుడు విడుదల చేస్తారో చెప్పాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. శనివారం జిల్లేడు చౌదరిగూడ మండల జర్నల్ కౌన్సిల్ సమావేశం సలీం ఫంక్షన్ హాల్ లాల్‌పహాడ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం నేడు రైతు భరోసా ఒక ధఫ పెండింగ్ ఉన్నాయి. మరో ధఫ నిధులు కూడా విడుదల చేయలేకపోయిందని అన్నారు. ప్రభుత్వం వెంటనే

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

రైతు భరోసా నిధులు విడుదల చేసి రైతుల ఖాతాలో జమ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అమెరికా ఇజ్రాయిల్ ఇరాక్‌పై యుద్ధం చేస్తూ దాని ఎఫెక్ట్ భారత్‌పై కూడా పడవద్దని అందులో భాగంగానే కేంద్ర ప్రభుత్వం అసమర్థన పాలనవల్ల గ్యాస్ కొరతలు మూలంగా అనేక రెస్టారెంట్లు హాస్టల్లు మూత పడుతున్నాయని ఆయన విమర్శించారు. భారత్ స్వతంత్ర దేశమని డెమోక్రటిక్ దేశమని ఒకరి దగ్గర మోకరిల్లాల్సిన పరిస్థితి లేదని ఇంధన దేశాలలో మనమే నేరుగా ఇంధనం కొనుగోలు చేయొచ్చని కానీ అలాంటి పరిస్థితి మోడీ బిజెపి ప్రభుత్వానికి లేదని ఆయన మండిపడ్డారు. అమెరికా ఇజ్రాయిల్ దగ్గర క్రూడ్ ఆయిల్ ఇప్పించమని మోకరిల్లడం అంటే భారత దేశ సార బహుమత్వాన్ని పరాయి దేశాల ముందల తాకట్టు పెట్టడమే అవుతుందని తెలిపారు. వెంటనే గ్యాస్ ధరలను తగ్గించి పేద ప్రజల ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉందని ఆయన తెలిసారు. అమెరికా ఇజ్రాయిల్ మురుకత్తపు ఆలోచనలు విడనాడాలని వెంటనే యుద్ధాన్ని ఆపాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 16వ తేదిన జాతీయ పార్టీ పిలుపుమేరకు అన్ని మండల కేంద్రాలలో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు బుద్దుల జంగయ్య, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు టంగుటూరి నరసింహారెడ్డి , సురేష్ వీరేష్ గోపాల్ బాలకృష్ణయ్య సిల్కమ్మ సందమ్మ బుచ్చమ్మ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శాసనమండలిలో కార్యాలయాన్ని ప్రారంభించిన పట్నం మహేందర్‌రెడ్డి

వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మార్చి 14, ప్రభాతవార్త: పున:నిర్మించిన తెలంగాణ శాసనమండలిలో ప్రభుత్వ చీప్‌విప్ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి కార్యా లయాన్ని ఆయన ప్రారంభించారు. శని వారం సాయంత్రం మహేం దర్‌రెడ్డి, సతీమణి పట్నం సునితారెడ్డి, కుమారు డు రినిష్‌రెడ్డితో కలిసి మండలి కార్యదర్శి నర్సింహా చార్యులు వేదపండితులు పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఆయన తన ప్రధాన చాంబర్‌లో ఆసీనులయ్యారు. ఈ సందర్భంగాసెక్రెటరి నర్సింహాచార్యులు చీప్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డికి బోకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కార్యాలయ సిబ్బంది పేషిలో పూజలు నిర్వహించారు. అధికారులు ఉపేందర్‌రెడ్డి, సుధాకర్, చీప్ మార్షల్ సంజీవరెడ్డి, పిఎస్ ప్రకాష్, అడిషనల్ పిఎస్ నాగిరెడ్డి, పిఆర్ఓ మల్లారెడ్డి, పీఏలు బాలు, రాజు, రాజేందర్‌రెడ్డి, వంశి తదితరులు పాల్గొన్నారు.

ఆశీర్వచనం తీసుకుంటున్న మహేందర్‌రెడ్డి దంపతులు

మొక్కలను నాటేందుకు స్థలాలను గుర్తించాలి

రంగారెడ్డి జిల్లా పరిషత్ సిఈఒ, నోడల్ అధికారి కృష్టారెడ్డి

కడ్తాల్, మార్చి 14, ప్రభాతవార్త : గ్రామీణ ప్రాంత ప్రజల భాగస్వామ్యంతో ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన పట్టణ ప్రణాళిక కార్యక్రమం విజయవంతం చేయాలని రంగారెడ్డి జిల్లా పరిషత్ సిఈఒ కృష్టారెడ్డి అన్నారు. శనివారం కడ్తాల్ మండలం మైసిగండి గ్రామంలో ఉన్న నర్సరీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిఈఒ కృష్టారెడ్డి మాట్లా డుతూ, మొక్కలను నాటేందుకు ఇప్పటినుంచి స్థలాలను గుర్తించాలని ఆయన సూచించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో అధికారులు, ప్రజాప్రతినిధులు, పాల్గొనాలని అన్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు గ్రామ పంచాయతీ సిబ్బందికి గ్రామ ప్రజలు సహకరించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుజాత, మండల

అధికారులు, గ్రామ సర్పంచ్ ప్రేమ జవహర్ లాల్ నాయక్, ఉపసర్పంచ్ హీరా సింగ్, మండలాధికారు లు గ్రామ పంచాయతీ సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రామలింగేశ్వరస్వామి రథోత్సవం

పెద్దఎత్తున పాల్గొన్న భక్తులు

కుల్కచర్ల,మార్చి 14, ప్రభాతవార్త: మండల పరిధిలోని పాంబండ్‌పాండ రామలింగేశ్వర స్వామి ఉత్సవాల్లో భాగంగా శనివారం తెల్లవారుజామున రథోత్సవం వైభవంగా నిర్వ హించారు.భక్తులు భక్తి శ్రద్ధలతో స్వామి వారిని దర్శించు కునేందుకు వివిధ ప్రాంతల నుండి తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.ఆలయ పూజారులు రామలింగేశ్వరస్వామికి అభిషేకం, అలంకరణ, మహ మంగళహరతి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఈఒ బాలనర్సయ్య, ఆలయ చైర్మన్ కోట్ల మహిపాల్ రెడ్డి,సర్పంచ్ మడుగు శ్రీనివాస్, ఉప సర్పంచ్ గోవర్ధన్ రెడ్డి, ఆయా గ్రామాల భక్తులు తదితరులు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు.

రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

తూంకుంటలో ప్రభుత్వం రంజాన్ దుస్తుల పంపిణీ

..మేడ్చల్ జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి

శామీర్‌పేట, మార్చి 14, ప్రభాతవార్త: రంజాన్ పండుగను పురస్కరించుకుని ముస్లీంల కోసం రాష్ట్ర ప్రభుత్వ అందజేసిన రంజాన్ తోఫా దుస్తులను మేడ్చల్ జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి పంపిణీ చేశారు. శనివారం శామీర్‌పేట మండలంలోని తూంకుంటలోని మజీద్ వద్ద రంజాన్‌ను పురస్కరించుకుని ప్రభుత్వం ముస్లీం సోదర,సోదరీమణులకు దుస్తులను ఆయన పంపిణీ చేశారు. స్థానిక మజీద్ వద్ద ఆ మజీద్ కమిటీ అధ్యక్షులు ఎండి గౌసేబాబా ఆధ్వర్యంలో రంజాన్ తోఫా దుస్తుల పంపిణీ కార్యక్రమం జరిగింది. దీనిలో జైపాల్‌రెడ్డితో పాటు ఇందిరమ్మ కమిటీ సభ్యులు రాజనాల శ్రీధర్‌రెడ్డి, గౌసేబాబాలు కలిసి వారికి దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ రంజాన్ నెల పవిత్రమైనదని, ఉపవాస దీక్షలు, ప్రార్థనలు, ధాన ధర్మాలతో ఈ నెలను అత్యంత ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రంజాన్ సందర్భంగా తోఫా గ దుస్తుల కిట్లను ముస్లీంలకు పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. రంజాన్ పండుగను ఉత్సాహంగ సంతోషంగా జరుపుకోవటానికి

తూంకుంటలోని మజీద్ వద్ద రంజాన్‌ను పురస్కరించుకుని ప్రభుత్వం అందిన దుస్తులను పంపిణీ చేసిన మేడ్చల్ జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి,పాల్గొన్న తదితరుల దృశ్యం

ప్రభుత్వం దుస్తులను అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మజీద్‌కమిటీ సభ్యులు ఎండి అమజాద్‌ఖాన్, అప్సర్ బేగ్, షేక్ నవాబ్, తహేర్, అన్వర్ బేగ్, మున్వర్‌బేగ్, జాంగిర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి

..శామీర్‌పేట జిహెచ్ఎంసి కార్మికుల ఆందోళన

..ఐఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.శివబాబు

శామీర్‌పేట, మార్చి 14, ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా ఉన్న నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఐఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.శివబాబు డిమాండ్ చేశారు. శనివారం శామీర్‌పేటలో జిహెచ్ఎంసి కార్మికులు కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ పోస్టర్‌ను ఆవిష్కరించి నిరసనలు తెలిపారు. ఈ నెల 16న జిల్లా కలెక్టరేట్‌ల వద్ద కార్మికుల హక్కుల సాధనకు మహాధర్నాలు నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈ నెల 23న ఛలో సెంట్రల్ లేబర్ కమిషనరేట్ (హైదరాబాద్) లేబర్ కోడ్స్ రద్దుకై పోరాడటం కార్యక్రమాన్ని చేపట్టటం జరిగిందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.శివబాబు మాట్లాడుతూ కార్మికుల హక్కుల సాధన కోసం ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో జరిగే మహాదర్నా కార్యక్రమాన్ని ఛలో కమిషనరేట్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. కార్మికులకు రోజుకు 8గంటల పనిదినంతో పాటు కనీసం నెలకు 26వేల రూపాయల వేతనం ఇవ్వాలని

శామీర్‌పేటలో జిహెచ్ఎంసి కార్మికులు నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని పోస్టర్‌ను ఆవిష్కరించిన ఐఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.శివబాబు,తదితరుల దృశ్యం

ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మొరుగు శ్రీకాంత్, కార్మిక నాయకులు పోచయ్య, యాదగిరి, కిట్టు, నాగరాజు, కమలమ్మ, సుగుణ, భారతి, యాదమ్మ, కవిత, మౌనిక, కలమ్మ, సంతోష, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మంచి లక్ష్యాన్ని ఎంచుకోవాలి

కేసర, మార్చి14, ప్రభాతవార్త:

వీడ్కోలు సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి

వీడ్కోలు సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్

విద్యార్థులు మంచి లక్ష్యాన్ని ఎంచుకోవాలని కేసర ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి కేసరలోని గౌతమి డిఫెన్స్ అకాడమీ జూనియర్ కళాశాల కాలేజీ వీడ్కో లు ఉత్సవాలు ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ విద్యార్థులు మంచిగా చదివి తమ బంగారు భవిష్యత్తుకు బాట వేసుకోవాలని అన్నారు. విద్యార్థులు బాగా చదివి తమ కళాశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు.గౌతమి డిఫెన్స్ కళాశాల డైరెక్టర్ సత్యం మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి తమ దైన శైలిలో చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలని అన్నారు.ప్రతి విద్యార్థి నూతన ఒరవడితో ముందు కెళ్లాలని, వారు అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని తల్లిదండ్రుల కలలు నిజం చేసు కోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గౌతమ్,వైస్ ప్రిన్సిపాల్ చంద్రయ్య,ఎక్స్ ఎయిర్స్ అధికారి సత్యనారాయణ,కస్యూడియన్ శ్రీధర్,రవీందర్, సాయి రాజ్,ఉపాధ్యాయులు ,విద్యా ర్థులు,తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

-చాక్‌పీస్ పట్టిన చిన్నారుల చేతులు

-బాధ్యతాయుత పాత్రల్లో విద్యార్థుల ప్రతిభ

దౌల్తాబాద్,మార్చి 14,ప్రభాతవార్త: వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలం గోకఫస్లవాద్ గ్రామంలోని పైనీయర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో శనివారంరోజు విద్యార్థులు ఉపా ధ్యాయులై స్వయం పరిపాలన దినోత్సవంను ఘనంగా జరుపుకున్నారు.విద్యార్థులు ఉపాధ్యాయులుగా ప్రత్యేకంగా తయారై పాఠశాలకు వచ్చారు.అనంతరం తోటి విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించి,ఉపాధ్యాయులు తమకు పాఠ్యంశాలు చెప్పేందుకు ఎంత కష్ట పడుతున్నరనే విషయం తెలుసుకున్నారు.ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులైన విద్యా ర్థులకు ఉపాధ్యాయులు బహుమతులను అందించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జయ రాసు,కరస్పాండెంట్ విరేశం,డైరెక్టర్ సుధాకర్‌లు మాట్లాడుతూ...విద్యార్థులు శ్రద్ధగా

స్వయం పరిపాలన దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు,విద్యార్థులు

చదువుకొని తల్లిదండ్రులకు,పాఠశాలకు మంచి పేరు తీసుకురావడంతో పాటు మంచి ఉద్యో గాలు పొంది ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు.జిల్లాకలెక్టర్‌గా అంజూమాన్ ఫాథి మాన్,డిప్యూటీ కలెక్టర్‌గా ఎస్.మహేష్,జిల్లా విద్యాధికారిగా బి.హరికృష్ణ,మండల విద్యా ధికారిగా పి.ఆశోక్,తహసీల్దార్‌గా ఆదిత్యరెడ్డి,వీఆర్ఓగా కవిత,ప్రిన్సిపాల్‌గా ఎన్.సం కీర్తనరెడ్డి,వీరితో పాటు 40 మంది సీనియర్ విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహ రించారు.ఈ కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెడల్స్,సర్టిఫికెట్స్ అంద జేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జగధీష్,రాజ్‌కమల్,అబ్దుల్ రహమాన్, శ్రీనివాస్,నర్సింలు,శ్వేత,సౌమ్య,మాధవి,మంజుల,నసీమ,దివ్యజ్యోతి,కవిత,ఫెలీనఫాఫీ,సానీ య,ఆసీయా,అనిత,అరుణ,యశోద,గోవిందమ్మ,మహేశ్వరీ,స్వాతి తదితరులు పాల్గొన్నారు.

దౌల్తాబాద్ నూతన ఎస్సైగా వేణుకుమార్

దౌల్తాబాద్,మార్చి 14,ప్రభాతవార్త: దౌల్తాబాద్ నూతన ఎస్సైగా వేణుకుమార్ శనివారంరోజు పదవీ బాధ్యతలు చేపట్టారు.దౌల్తాబాద్ మండలంలో ఇదివరకు ఎస్సైగా బాధ్యతలు నిర్వహిస్తున్నా బి.రాజ్‌కుమార్ బదిలీ అయ్యారు.

ఎస్సైగా పదవి బాధ్యతలు చేపట్టిన వేణుకుమార్

వికారాబాద్ విఆర్ లో విధులు నిర్వహిస్తున్నా ఎస్సై వేణుకుమార్ బదిలీపై ఇక్కడికి వచ్చారు.ఈ సంధర్భంగా నూతన ఎస్సై మాట్లాడుతూ..గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు సంచరించినా,ఏదైనా అవాంఛనీయ సంఘటనలు జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.మండలంలో దొంగతనాలు,పేకాట,ఇసుక అక్రమ రవాణా వంటి అసాంఘిక కార్య కలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచుతామని,శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా కృషిచేస్తామని అన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జిల్లెడు చౌదరిగూడ,మార్చి 14,(ప్రభాతవార్త):

జిల్లెడు చౌదరిగూడ మండలంలోని చౌదరిగూడ సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ నర్సింహులు శనివారం ఒక ప్రకటనలో తెలిఎపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తుల కారణంగా 11గంటల నుంచి మధ్యాహ్నం 3:30గంటల వరకు విద్యుత్ సరఫర నిలిపివేయనున్నట్లు ఆయన పెర్కొన్నారు. విద్యుత్ అంతరాయానికి సబ్‌స్టేషన్ పరిధిలోని వినియోగ దారులు సహకరించాలని ఆయన కోరారు.

ప్రజాపాలనలో శ్రమదానాల వెల్లువ

మురహరిపల్లిలో మురహరిపల్లిలో నర్సరీ వద్ద చీపుర్లు పట్టి శుభ్రం చేస్తున్న అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి,పాల్గొన్న కమిషనర్ చంద్రశేఖర్, కౌన్సిలర్లు,అధికారుల తదితరుల దృశ్యం

నర్సరీలను శుభ్రం చేసిన మున్సిపల్ ప్రజాప్రతినిధులు, అధికారులు

శామీర్‌పేట, మార్చి 14, ప్రభాతవార్త: ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నర్సరీలను శుభ్రం చేసిన మున్సిపల్ ప్రజాప్రతినిధులు, అధికారులు శ్రమదానం చేస్తూ శుభ్రం చేశారు. శనివారం అలియాబాద్ మున్సిపాల్టీ పరిధిలోని మురహరిపల్లి, మజీద్‌పూర్ గ్రామాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ కంఠం శిరీషకృష్ణారెడ్డి,కమిషనర్ చంద్రశేఖర్‌ల ఆధ్వర్యంలో శానిటేషన్, పరిశుభ్రత కార్యక్రమాలను వారు నిర్వహించారు. వచ్చే జూన్‌లో మొక్కలను నాటే కార్యక్రమం ఉంటుందని దీని కోసం ఆయా గ్రామాల్లో ఉన్న నర్సరీలను ముందస్తుగా శుభ్రం చేసే కార్యక్రమానికి శ్రీకారం

అలియాబాద్ మున్సిపల్ కార్యాలయం వద్ద పారిశుద్యకార్మికులను సన్మానించిన మున్సిపల్ చైర్‌పర్సన్ కంఠం శిరీషకృష్ణారెడ్డి,పాల్గొన్న కమిషనర్ చంద్రశేఖర్, అధికారులు, సిబ్బంది తదితరుల దృశ్యం

చుట్టి మురహరిపల్లి, మజీద్‌పూర్ గ్రామాల్లోని ఆయా వార్డులో కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు కౌన్సిలర్లు యూసుఫ్‌బాబు, హనుమాన్‌దాస్, గురకల దీప, ఎల్లు దీపిక, హోపవత్ వెంకటేశ్, జశ్వంత్‌రెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, నవీన్‌రెడ్డి, వరప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ సంబంధిత అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, వేణుగోపాల్,విజయకుమార్, పారిశుద్య కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

..అలియాబాద్ మున్సిపల్ కార్యాలయం వద్ద పారిశుద్య కార్మికులకు సన్మానం

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని అలియాబాద్ మున్సిపల్ మహిళా పారిశుద్య కార్మికులను మున్సిపల్ చైర్‌పర్సన్ కంఠం శిరీషకృష్ణారెడ్డి, కమిషనర్ చంద్రశేఖర్‌లు సన్మానించారు. శనివారం శామీర్‌పేట మండలంలోని అలియాబాద్ మున్సిపల్ కార్యాలయం వద్ద మహిళా పారిశుద్య కార్మికులకు సన్మాన కార్యక్రమం జరిగింది. మహిళా పారిశుద్య కార్మికులు చేస్తున్న కృషిని గుర్తించి వారిని సన్మానించి బహుమతులను వారు అందజేశారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు మున్సిపల్ అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, వేణుగోపాల్, విజయ్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అద్రాస్‌పల్లిలో రోడ్ల శుభ్రతకు చీపుర్లు పట్టిన నాయకులు

.. మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జామ్ రవి, పాల్గొన్న కమిషనర్, కౌన్సిలర్లు, నాయకులు

శామీర్‌పేట, మార్చి 14, ప్రభాతవార్త: మూడుచింతలపల్లి మున్సిపల్ పరిధిలోని అద్రాస్‌పల్లి గ్రామంలోని 22,23వార్డులలో ప్రజాపాలన-ప్రగతి

అద్రాస్‌పల్లి గ్రామంలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో పరిశుభ్రతకు శ్రమదానం చేసిన మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జామ్ రవి, కమిషనర్, కౌన్సిలర్లు, అధికారులు, నాయకులు, సిబ్బంది దృశ్యం

ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రోడ్లను పరిశుభ్రతకు చీపుర్లు పట్టి మున్సిపల్ ప్రజాప్రతినిధులు, అధికారులు శ్రమదానం చేశారు. శనివారం మూడుచింతలపల్లి మున్సిపల్ పరిధిలోని అద్రాస్‌పల్లి గ్రామంలో రోడ్ల శుభ్రతకు చీపుర్లు పట్టి శుభ్రం చేసి,రోడ్లకు, ఇళ్ల పక్కన ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. క్లీనింగ్, క్లియరింగ్ నిర్వహించారు. మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవి ఆధ్వర్యంలో ఈ

అద్రాస్‌పల్లిలో పారిశుద్య కార్మికులను సన్మానించి చైర్మన్ జాము రవి, కమిషనర్ పవన్‌కుమార్, అధికారులు, కౌన్సిలర్లు తదితరుల దృశ్యం

కార్యక్రమం జరిగింది. దీనిలో కమిషనర్ పవన్‌కుమార్, కౌన్సిలర్లు అజయ్‌కుమార్, పి.ప్రభాకర్, నీరజ్‌గౌడ్, నాయకులు భూమేశ్‌గౌడ్, వెంకటేశ, శ్రీనివాస్‌గౌడ్,దత్తుగౌడ్, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొని శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

అన్నోజిగూడలో ఈ వేస్ట్ మేగా డ్రైవ్‌లో పాల్గొన్న డిప్యూటీ కమిషనర్ వాణి

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 14, ప్రభాత వార్త: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా శనివారం పోచారం డివిజన్ అన్నోజిగూడలో ఈ వేస్ట్ మేగా డ్రైవ్ కార్యక్రమం చేపట్టారు. అన్నోజిగూడ ఎస్టీ కమ్యూనిటీ హాల్‌లో ఈ వేస్ట్ మెగా డ్రైవ్ కార్యక్రమంలో మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ ఏ. వాణి పాల్గొని మాట్లాడుతూ సాంకేతికత పెరుగుతున్న కొద్ది ఎలక్ట్రానిక్ వ్యర్థాలు పర్యావరణానికి పెద్ద సవాలుగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పాడైపోయిన సెల్‌ఫోన్‌లు, కంప్యూటర్ పరికరాలను ఎక్కడబడితే అక్కడ

అన్నోజిగూడలో ఈ వేస్ట్ మేగా డ్రైవ్ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ కమిషనర్ వాణి తదితరులు.

పారవేయకుండా శాస్త్రీయ పద్ధతిలో రీసైక్లింగ్ చేయడమే ఈ డ్రైవ్ ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాలి

సర్పంచ్ కుమ్మరి లావణ్య చెన్నయ్య

షాబాద్, మార్చి 14, ప్రభాతవార్త : ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షి ంచాలని గ్రామ సర్పంచ్ కుమ్మరి లావణ్య చెన్నయ్య పేర్కొన్నారు. 99 రోజుల కార్యాచరణ కార్యక్రమం ప్రజా పాలన - ప్రగతి

నర్సరీని పరిశీలిస్తున్న దృశ్యం

ప్రణాళికలో భాగంగా శనివారం గ్రామంలోని నర్సరీ ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విధిగా ప్రతి ఒక్కరూ 6 మొక్కలు నాటాలని చెప్పారు. ఈ సంవత్సరం ప్రజలందరికీ ఉపయోగపడేలా నారు తీసుకువచ్చినట్లు చెప్పారు. గ్రామంలోని నర్సరీ వనసేవక్ కుమ్మరి సుగుణమ్మ కు పలు సూచనలు చేశారు. పర్యావరణాన్ని కాపాడుకోవడం కోసం మొక్కలు నాటే అవసరం ఎంతైనా ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య, ఉప సర్పంచ్ గణపురం ప్రభాకర్, వార్డు సభ్యులు జయమ్మ, బొగ్గుల సత్తయ్య, పి. స్వప్న, నాయకులు కుమ్మరి శివ రాములు, చీమల వెంకటయ్య, పి. అంజిరెడ్డి,పి. యాదయ్య, ఎం. నర్సింలు, పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ ఫయాజ్, టీఏ అనిత తదితరులు పాల్గొన్నారు.నర్సంచ్ ను అభినందించిన ఎంపీఓమధ్యాహ్న సమయంలో సంకేపల్లిగూడ నర్సరీ ని మండల పంచాయతీ అధికారి నాసరయ్య సందర్శించారు. నర్సరీ రిజిష్టర్ ను పరిశీలించారు. నర్సరీ నిర్వహణ బాగుందని సర్పంచ్ కుమ్మరి లావణ్య చెన్నయ్య ను అభినందించారు. తడి చెత్త ద్వారా సేంద్రీయ ఎరువు తయారీ కేంద్రం వద్ద ఎరువు తయారు చేయాలని సర్పంచ్ కు సూచించారు.

ఆర్కపల్లి నర్సరీలో షెడ్ నెట్స్ ఏర్పాటు

మాడ్గుల, మార్చి14, ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అర్కపల్లి గ్రామపంచాయతీలో 14వ రోజు నర్సరీ తయారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆర్కపల్లి గ్రామంలోని నర్సరీలో మొక్కల పెంపకానికి అనుకూలంగా షెడ్ నెట్స్‌ను ఏర్పాటు చేశారు. నర్సరీలో పెంచే మొక్కలు ఎండ, వర్షం వంటి వాతావరణ ప్రభావాల నుంచి రక్షణ పొందేందుకు షెడ్ నెట్స్ ఉపయోగపడతాయని గ్రామపంచాయతీ అధికారులు తెలిపారు. గ్రామంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు నర్సరీల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. నర్సరీలో పెంచిన మొక్కలను గ్రామంలోని వివిధ ప్రదేశాల్లో నాటేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కళ్ళు భాగ్యలక్ష్మి తిరు పతిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన – ప్రగతి కార్య క్రమాలు గ్రామాభివృద్ధికి ఎంతో దోహద పడుతున్నాయని అన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని గ్రామ ప్రజలకు పిలుపునిచ్చారు.

షెడ్ నెట్స్ ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశం

మేడ్చల్, మార్చి 14, ప్రభాతవార్త : మేడ్చల్ సర్కిల్‌లోని కిష్టాపూర్ గ్రామంలో తుపాకుల లతా శంకర్ నిర్మించుకున్న ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం కార్యక్రమాన్ని కాంగ్రెస్ నేతలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఎక్సైజ్ ప్రైస్ ఫిక్సేషన్ కమిటీ మెంబర్ నవీన్ రెడ్డి, మేడ్చల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రేగు రాజు, మాజీ వైస్ చైర్మన్ చీర్ల రమేష్ యాదవ్, నాయకులు మల్లేష్ గౌడ్, దేవా, శ్రీకాంత్, మల్లారెడ్డి, రంజిత్, యాదయ్య, సుధాకర్, ఆకాష్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల గోడపత్రిక విడుదల

షాబాద్, మార్చి 14, ప్రభాతవార్త : మండలంలోని కొమరబండ బుగ్గ రామేశ్వర స్వామి జాతర ఉత్సవాల ఆహ్వాన గోడ పత్రికను శనివారం విడుదల చేశారు. ఆలయ ప్రాంగణం ఆవరణలో గ్రామ సర్పంచ్, గ్రామస్తులు దేవస్థానం కమిటీ సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పద్మమ్మ గోపాలు ఆలయ చైర్మన్ చేవెళ్ల వెంకటయ్య మాజీ సర్పంచ్ లు గ్రామస్తులు దేవస్థానం ఈవో శ్రీనివాసులు తదితరులు మాట్లాడుతూ ఈనెల19 నుండి 26 వరకు బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతాయని గ్రామంతోపాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యుడిగా ఆకుల మహేష్ కుమార్

వికారాబాద్, మార్చి 14, ప్రభాతవార్త : తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యుడిగా వికారాబాద్ పట్టణానికి చెందిన ఆకుల మహేష్‌కుమార్ గెలుపొందాడు. తెలంగాణ హైకోర్టు పరిధిలో నిర్వహించిన తెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్నికల్లో న్యాయవాది ఆకుల మహేష్ కుమార్ ఘన విజయం సాధించారు. మొత్తం 203 మంది అభ్యర్థులు పోటీ చేసిన ఈ ఎన్నికల్లో ఆయన మూడో స్థానంలో నిలిచి గెలుపొందడంతో వికారాబాద్ న్యాయవాదులు అభినంధనలు తెలిపారు. న్యాయవాదుల మధ్య మంచి పేరు సంపాదించిన మహేష్ కుమార్ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ అందరి అభిమానాన్ని పొందారని, కోర్టు పరిసరాల్లో అవసరమైన సౌకర్యాల కోసం ముందుకు రావడం, అవసరమైన వారికి సహాయం చేయడంతోనే ఈ గెలుపు సాధ్యమైందని పలువురు న్యాయవాదులు మహేష్‌కుమార్‌ను ప్రశంసించారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న న్యాయవాదులకు ఉచితంగా పుస్తకాలు అందించడం, ప్రమాదాల్లో గాయపడిన వారికి ఆసుపత్రుల్లో సహాయం చేయడం వంటి సేవా కార్యక్రమాలు మహేష్‌కుమార్ గెలుపు కారణమయ్యాయని న్యాయవాదులు పేర్కొన్నారు. ఆయన చేస్తున్న సేవలను గుర్తించిన న్యాయవాదులు మంచి మెజార్టీతో ఆయనను గెలిపించారని న్యాయవాదులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా తనను విశ్వసించి గెలిపించిన న్యాయవాదులందరికీ ఆకుల మహేష్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రశాంతంగా ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు

పరీక్ష కేంద్రంలోపలికి వెళుతున్న విద్యార్థులు

దౌల్తాబాద్, మార్చి 14, ప్రభాతవార్త: దౌల్తాబాద్ మండల కేంద్రంలో పదవ తరగతి వార్షిక పరీక్షలు శనివారంరోజు ప్రారంభమయ్యాయి. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(జడ్‌పీహెచ్‌ఎస్), ప్రాథమిక పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో మండలంలోని ఆయా పాఠశాలలోని విద్యార్థులు మొదటిరోజు పరీక్షకు హాజరయ్యారు. పరీక్షల నిర్వహణకు మండల విద్యాధికారి వెంకటయ్య పర్యవేక్షించారు. మండల వ్యాప్తంగా మొత్తం 366 మంది విద్యార్థులకు గాను 363 మంది హాజరుకాగా, ముగ్గురు(3) విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నట్లు, విద్యార్థులకు అవసరమైన కనీస వసతులను కల్పించినట్లు అధికారులు వెల్లడించారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు ప్రారంభం

మేడ్చల్, మార్చి 14, ప్రభాతవార్త : మేడ్చల్ మండలంలో పదో తరగతి పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయి. మండలంలో 2145 మంది పదో తరగతి విద్యార్థులు ఉండగా వారి కోసం 10 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9.30 గంటల నుండి మద్యాహ్నం 12.30 గంటల వరకు ఈ పరీక్షలు జరుగుతున్నాయి. శనివారం జరిగిన మొదటి రోజు పరీక్షకు 2140 మంది పరీక్ష రాయగా ఐదు మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని విద్యాధికారి తెలిపారు.

హాల్‌టికెట్ నెంబర్లను చూపుకుంటున్న విద్యార్థులు

ధారూర్‌లో ప్రశాంతంగా తొలి పరీక్ష

ధారూర్, మార్చి 14, ప్రభాత వార్త: ధారూర్ మండల కేంద్రంతో కెరెల్లీ సెంటర్ పదో తరగతి వార్షిక పరీక్షలు శనివారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. మొదటి రోజు జరిగిన పరీక్షకు విద్యార్థులు ఉత్సా హంగా హాజరయ్యారు. మండల వ్యాప్తంగా మొత్తం 324 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 323 మంది విద్యార్థులు హాజరయ్యారు. కాగా, కెరెల్లీ పరీక్ష కేంద్రంలో ఒక విద్యార్థి గైర్హాజైనట్లు విద్యాశాఖ అధి కారులు వెల్లడించారు .పరీక్షల నిర్వ హణ కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. కేంద్రాల పరిసరాల్లో 163 బిఎన్ఎస్ఎస్ అమలు చేస్తూ, విద్యార్థులు ప్రశాంతంగా పరీక్ష రాసేలా చర్యలు తీసుకున్నారు. మొదటి రోజు పరీక్ష సజావుగా ముగియడంతో అటు అధికారులు, ఇటు తల్లిదండ్రులు సంతృప్తి వ్యక్తం చేశారు.

కెరెల్లీ పరీక్ష కేంద్రం వద్ద పరీక్ష రాసి బయటికి వస్తున్న విద్యార్థులు

పరీక్షల కోసం పకడ్బందీగా ఏర్పాట్లు

జవహర్ నగర్ మార్చ్ 14 ప్రభాతవార్త : పదవ తరగతి వార్షిక పరీక్షలు శనివారం ప్రారంభంయ్యాయి. కాప్రా పరిధిలోని ఆయా పరీక్షా కేంద్రాల వద్దకు విద్యార్థులు గంట ముందే ఉదయం 8:30 గంటలకల్లా చేరుకున్నారు. కేంద్రాల లోనికి వెళ్లేముందు అధికారులు విద్యార్థుల హాల్ టికెట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. సెల్‌ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు మరియు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించలేదు. విద్యార్థుల వస్తువుల భద్రత కోసం గేటు వద్దే ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఉదయం 9:30 గంటలకు పరీక్ష ప్రారంభం కానుంది నిబంధనల ప్రకారం విద్యార్థులకు 5 నిమిషాల గ్రేస్ పీరియడ్ (9:35 వరకు) అనుమతిస్తారు పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా 144 ఫ్లయింగ్ స్క్వాడ్లను రంగం లోకి దించారు. ఎటువంటి అక్రమాలకు తావులేకుండా సిసి కెమెరాల నిఘా కూడా ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద వైద్య ఆరోగ్య శాఖ సిబ్బం దిని, తాగునీటి సదుపాయాలను కూడా స్థానిక అధికారులు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు ప్రారంభం

పెద్దేముల్, మార్చి 14, ప్రభాతవార్త: పెద్దేముల్ మండలంలో మూడు పరీక్షల కేంద్రాలలో పది పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. శనివారం నుంచి ప్రారంభమైన పది పరీక్షలకు మొదటి రోజు కావడంతో విద్యార్థులు ఉరుకులు పరుగులు పెట్టారు. సమాయాని కంటే ముందుగా పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. మండలంలోని పెద్దేముల్ జడ్‌పిహెచ్‌ఎస్ (బాలుర), జడ్‌పిహెచ్‌ఎస్ (బాలికల), మంబాపూర్ జడ్‌పిహెచ్‌ఎస్ మూడు పరీక్ష కేంద్రాలలో 568 మంది విద్యార్థులకు గాను 566 మంది విద్యార్థులు హాజరుకాగా ఇద్దరు గైర్హాజర్ అయినట్లు యంఈఓ నర్సింగరావు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి అవాంచనీయమైన సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ ప్రశాంత్ వర్ధన్ తెలిపారు.

పది పరీక్షలకు హాజరైన విద్యార్థులు

ప్రశాంతంగా ఎస్ఎస్‌సి పరీక్షలు

ఘట్‌కేసర్, మార్చి 14, ప్రభాతవార్త: ఘట్‌కేసర్‌లో శనివారం పదవతరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొత్తం 8 పరీక్షా కేంద్రాలలో ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు మొదటిబాషా పరీక్ష నిర్వహించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. 8 పరీక్షా కేంద్రాలలో మొత్తం 1,620 మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నారు. ఘట్‌కేసర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 200 మంది, బాలికల ఉన్నత పాఠశాలలో 240 మంది, హోలీఫెయిత్ గ్రామర్ స్కూల్‌లో 200 మంది, సెయింట్ అంథోనీస్ హైస్కూల్‌లో 200 మంది, శ్రీచంద్రస్కూల్‌లో 220 మంది, శివారెడ్డిగూడలోని విద్యాకిరణ్ హైస్కూల్‌లో 200 మంది, కొర్రెముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 180 మంది, అన్నోజీగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 180 మంది చొప్పున విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నారు.

వారియర్స్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు

మేడ్చల్, మార్చి 14, ప్రభాతవార్త : మేడ్చల్ పట్టణంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చీర్ల రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన మేడ్చల్ వారియర్స్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్ విజయవంతంగా ముగిసింది. ఈ ట్రోఫీ విజేతగా డేర్ బుల్స్ జట్టు గెలుపొందగా రన్నర్స్‌గా ఆల్ఫా టీమ్ నిలిచింది. అదే విదంగా మూడు, నాలుగో స్థానంలో మరో రెండు జట్లు నిలువగా విజేతలకు కప్‌తో పాటు బహుమతులను అందజేశారు. ఈ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి, జిల్లా మాది అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నక్క ప్రభాకర్ గౌడ్, కాంగ్రెస్ నాయకుడు నవీన్ రెడ్డి, వేముల శ్రీనివాస్ రెడ్డి, రమణ రెడ్డి, వర్ధా రెడ్డి, బాల మల్లేష్, చాపా రాజు, సత్యానారాయణ, శివ శంకర్, రేగు రాజు, మధుకర్ యాదవ్, నరేందర్, రవీందర్ రెడ్డి, దేవ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విజేత జట్టుకు కప్ అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

విద్యార్థులకు రవాణా సదుపాయం కల్పించి, పరీక్ష కిట్లను అందజేస్తున్న సర్పంచ్ కీర్తి రామకృష్ణ

ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తా

..సర్పంచ్ కీర్తి రామకృష్ణ

మోమిన్ పేట్. మార్చి 14. ప్రభాత వార్త: గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రతి ఒక్కటి అమలు చేస్తామని తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి, కోల్కుంద సర్పంచ్ కరణం కీర్తి రామకృష్ణ తెలిపారు. శనివారం పదవ తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలు ప్రారంభం కావడంతో వారికి బోర్డు ఎగ్జామ్స్ ఫీజు, ఎగ్జామ్స్ కిట్ అందజేయటంతో పాటు వారికి గ్రామం నుండి మోమిన్ పేట్ పరీక్షా కేంద్రానికి రవాణా సౌకర్యం, అలాగే పరీక్షల అనంతరం వారికి భోజన సదుపాయం కూడా కల్పించి స్వయంగా విద్యార్థుల దగ్గరుండి వడ్డించారు. ఈ సందర్భంగా కారణం కీర్తి రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల సమయంలో ఎలాంటి ఇబ్బందులకు గురి కాకుండా మంచి మార్కులు సాధించి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మహేందర్ రెడ్డి, వార్డ్ సభ్యులు నాగమణి, స్వరూప, బిచప్ప, కాసిం, గ్రామ పెద్దలు కుత్బుద్దీన్, సంగమేశ్వర్, అబ్దుల్, శ్రీనివాస్, రాజు, రషీద్, వైద్యనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పులికంటి మహేష్ కుటుంబానికి గ్రామస్తుల ఆర్థిక సాయం

మాడ్గుల, మార్చి14, ప్రభాతవార్త: మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న పులికంటి మహేష్ కుటుంబానికి గ్రామస్తులు అండగా నిలిచారు. బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు గ్రామ ప్రజలు స్వచ్ఛందంగా ఆర్థిక సహాయం సేకరించి అందజేశారు. 5వ వార్డు సభ్యుడు గోరటి వెంకటేష్ చొరవతో గ్రామస్తుల నుంచి సేకరించిన రూ. 27,300లను మహేష్ కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం బిఆర్ఎస్ నాయకులు ఉప్పల వెంకటేశ్ అందించిన 3వేలు రూపాలయలను సర్పంచ్ కోరుకోరు తిరుపతయ్య అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కష్టకాలంలో ఒకరికి ఒకరు తోడుగా నిలవడం గ్రామప్రజల ఐక్యతకు నిదర్శనమని అన్నారు. ఉప సర్పంచ్ గోరటి చెన్నమ్మ తిరుపతయ్య కూడా కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పులికంటి కొములయ్య, కట్ట కృష్ణవంశీతో పాటు గ్రామస్థులు గోరటి తిరుపతయ్య, కట్ట లక్ష్మయ్య, నల్లవెల్లి కుమార్, నల్లవెల్లి శేఖర్, గోరటి మహేష్ తదితరులు పాల్గొన్నారు. గ్రామస్తులంతా కలిసి బాధిత కుటుంబానికి అండగా నిలుస్తామని తెలిపారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న సర్పంచ్ తిరుపతయ్య

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలే యాదర్య

చేవెళ్ల, మార్చి 14, ప్రభాతవార్త : చేవెళ్ల మున్సిపల్ అభివృద్ధికి కృషి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. చేవెళ్ల మున్సిపల్ 202627 ఆర్థిక సంవత్సరం మొదటి బడ్జెట్ సమావేశం చైర్ పర్సన్ దేవర సమత వెంకట్ రెడ్డి అధ్యక్షతన శనివారం చేవెళ్ల మున్సిపల్ కార్యాలయంలో జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కాలె యాదయ్య హాజరై మున్సిపల్ బడ్జెట్ పై చర్చించారు. చేవెళ్ల మున్సిపల్ కార్యాలయానికి ఏడాదికి పన్నుల రూపంలో రూ.10 కోట్ల 2 లక్షల 90 అంచనా వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ.. మున్సిపల్ అభివృద్ధికి కృషి చేస్తానని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మున్సిపల్ అభివృద్ధికి అధిక నిధులు వస్తాయని చెప్పారు. మున్సిపల్ కు వచ్చే ఆదాయాన్ని అవసరం ఉన్న చోట ఖర్చు చేయాలని, మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో నీటి సమస్య, పారిశుధ్యం, వీధి దీపాలు తదితర మౌలిక సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశం, మేనేజర్, వైస్ చైర్మన్ రాములు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సమన్వయంతో ముందుకు సాగాలి..

మొయినాబాద్, మార్చి 14, ప్రభాతవార్త : మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రభుత్వం తగినన్ని నిధులు ఇస్తుందని, అధికారులు కౌన్సిలర్లు సమన్వయంతో ముందుకు సాగి మున్సిపాలిటీని ప్రగతిపతంలో నడిపించాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మొయినాబాద్ మున్సిపాలిటీ 2026 27 వార్షిక బడ్జెట్ సమావేశం శనివారం మండల పరిషత్ కార్యాలయంలో చైర్ పర్సన్ సోనియా దర్శన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక గ్రాంట్లు ఇస్తుందన్నారు. వివిధ గ్రాంట్ల ద్వారా సుమారు రూ.100 కోట్ల నిధులు వస్తాయన్నారు. మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు పాలకవర్గం కృషి చేయాలని చెప్పారు.

మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలే యాదయ్య

మున్సిపల్ బడ్జెట్ రూ.122.95 కోట్లు..

మున్సిపల్ వార్షిక బడ్జెట్ సమావేశంలో మొదటి బడ్జెట్ రూ.122.95 కోట్లుగా ప్రవేశపెట్టారు. ట్యాక్స్ రిసోర్స్ ద్వారా రూ.18.6 కోట్లు, నాన్ ట్యాక్స్ రిసోర్స్ ద్వారా రూ.2.9 కోట్లు, డిపాజిట్, లోన్స్ ద్వారా రూ.50 లక్షలు, వివిధ గ్రాంట్ల ద్వారా రూ.102.30 కోట్లు సమకూర్చుకునే విధంగా బడ్జెట్ను ప్రవేశపెట్టారు. దీనిపై కౌన్సిలర్లు చర్చించిన అనంతరం ఆమోదం తెలిపారు. అదే విధంగా సాధారణ సమావేశంలో వివిధ అభివృద్ధి పనులపై చర్చించారు. పారిపర్య విభాగానికి రూ.7 లక్షలు, ఇంజనీరింగ్ విభాగానికి రూ.78 లక్షలు, వచ్చే ఆర్థిక సంవత్సరం ఖర్చులకు రూ.7.45 కోట్లు కేటాయిస్తూ కౌన్సిల్లో ఆమోదం తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, వైస్ చైర్మన్ గరుగు రాజు, కౌన్సిలర్లు. అధికారులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి

చేవెళ్ల, మార్చి 14, ప్రభాతవార్త : చేవెళ్ల మండల పరిధిలోని ఎన్కేపల్లి గ్రామానికి వెళ్లే రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్యను గ్రామస్తులు కోరారు. ఈ సందర్భంగా సర్పంచ్ మైపాల్ రెడ్డి, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్యను ఆయన నివాసంలో కలిసి గ్రామానికి రహదారి ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి సక్రమంగా లేకపోవడంతో విద్యార్థులు, గ్రామ ప్రజలు ప్రతిరోజూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా వర్షాకాలంలో రాకపోకలు కష్టంగా మారుతున్నాయని వివరించారు. దీనిపై ఎమ్మెల్యే యాదయ్య సానుకూలంగా స్పందిన న్నాసమ స్యను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కొద్దిరోజులలోనే రహదారి పనులు ప్రారంభించి గ్రామ ప్రజలకు సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



గ్యాస్ సిలిండర్‌లను బ్లాక్‌లో విక్రయస్తే కఠిన చర్యలు

మొయినాబాద్, మార్చి 14, ప్రభాతవార్త : అమెరికా ఇరాన్ యుద్ధ కారణంగా గ్యాస్ సిలిండర్ ల యొక్క కొరత ఏర్పడిందని వార్తలు వస్తున్న నేపథ్యంలో మండలంలోని ఇండియాన్ గ్యాస్ గోడౌన్ ని పరిశీలించిన తహసీల్దార్ గౌతమ్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్ లను బ్లాక్ లో అమ్మినచో కఠిన చర్యలు ఉంటాయని గ్యాస్ ఏజెన్సీస్ నిర్వాహకులు ఎక్కడ బ్లాక్లో విక్రయించవద్దని హెచ్చరించారు. అంతేకాకుండా మండలంలో ప్రజలకు అవసరం అయినా గ్యాస్ సిలిండర్లు సరిపడినన్ని అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురి కాకూడదని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ. రాజేష్ పాల్గొన్నారు.

గ్యాస్ గోదాంను పరిశీలిస్తున్న అధికారులు

ప్రభుత్వ భూముల్లో బహుళ అంతస్థుల భవనాలు?

కోట్లు విలువైన భూమిలో యథేచ్ఛగా అపార్ట్‌మెంట్‌లు

సంగారెడ్డి/ అమీన్‌పూర్, మార్చి 14, ప్రభాతవార్త : ప్రభుత్వ భూములకు రక్షణ కరువైంది. సామాన్యుడు గజం స్థలం ఆక్రమిస్తే జరిమానాలు విధించే అధికారులు, కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ ఆస్తి కళ్లముందే కబ్జాకు గురవుతున్నా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ భూమిలో అక్రమంగా వెలుస్తున్న అపార్ట్‌మెంట్ల నిర్మాణం ఇప్పుడు స్థానికంగా పెను దుమారం రేపుతోంది. ఈ భూ ఆక్రమణపై స్థానిక రాజకీయ నాయకులు గత కొంతకాలంగా పోరాటం చేస్తూనే ఉన్నారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నందారం నర్సింహా గౌడ్, మాజీ కౌన్సిలర్ మరియు బీజేపీ నాయకులు ఎడ్ల రమేష్, బీజేపీ సీనియర్ నాయకులు ఆదెల్లి రవీందర్, నందారం రమేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కోకల శ్రీనివాస్, సత్యనారాయణ స్థానికులు పలుమార్లు జిల్లా కలెక్టరును కలిసి ఫిర్యాదు చేశారు. ప్రజావాణి కార్యక్రమంలో వినతి పత్రాలు సమర్పించినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఎంఆర్వో కార్యాలయం నుండి కలెక్టరేట్ వరకు తిరిగినా ఫలితం లేకపోవడంతో అధికారుల తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

'మేము ఇక్కడే పుట్టి పెరిగాము. మా తాతల కాలం నుండి ఏది ప్రభుత్వ భూమి, ఏది ప్రైవేటు భూమి అనే హద్దులు మాకు స్పష్టంగా తెలు. విలేజ్ మ్యాప్ పరిశీలిస్తే స్పష్టంగా ప్రభుత్వ భూమి అని కనిపిస్తోంది. ఇంత జరుగుతున్నా అధికారులు ఎందుకు మౌనంగా ఉంటున్నారు? అని స్థానిక నాయకులు మీడియా ముఖంగా ప్రశ్నిస్తున్నారు.

ఎంతమంది ఫిర్యాదులు చేసినా, నిరసనలు తెలిపినా నిర్మాణ పనులు మాత్రం నిరాటంకంగా, మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతున్నాయి. దీని వెనుక అధికారులు కబ్జాదారుల మధ్య లోపయాకారి ఒప్పందాలు ఉన్నాయనే గుసగుసలు స్థానికంగా బలంగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత కలిగిన అధికారులే కళ్లు మూసుకుంటే, ఇక సామాన్యులకు దిక్కెవరని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేస్తున్న స్థానిక ప్రజాప్రతినిధులు

పారదర్శకత నిరూపించుకోవాలి

ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా చూడాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, వెంటనే విచారణ జరిపి నిర్మాణాలను నిలిపివేయాలని.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు తమ పారదర్శకతను నిరూపించుకోకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరిస్తున్నారు.

వయోధికులకు వెంటనే వంట గ్యాస్ సిలిండర్ ఇవ్వాలి

ఘట్‌కేసర్, మార్చి 14, ప్రభాతవార్త: వృద్ధుల ఆరోగ్య సమస్యలు, శారీరక బలహీనతల కారణంగా గ్యాస్ సిలిండర్ కోసం గంటల తరబడి వేచి ఉండటం, పలుసార్లు గ్యాస్ ఏజెన్సీల వద్దకు వెళ్లడం చాలా కష్ట సాధ్యంగా మారిందని వెంటనే సిలిండర్ ఇచ్చేవిధంగా చూడాలని కోరుతూ డెమొక్రటిక్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తోట రంగయ్య శనివారం ఘట్‌కేసర్‌లోని ఐఓసీ ఈశ్వరా గ్యాస్ ఏజెన్సీ మేనేజర్ బోనకుర్తి వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. పశ్చిమాసియా యుద్ధం కారణంగా ఏర్పడిన సిలిండర్ల కొరతపై ప్రజలలో ఆందోళన నెలకొందని వృద్ధుల ఆరోగ్యం, భద్రత దృష్ట్యా వృద్ధులకు ఇంటివద్దనే సిలిండర్లను త్వరితగతిన ఇచ్చేందుకు గ్యాస్ సరఫరా సంస్థలు, ప్రభుత్వం, గ్యాస్ ఏజెన్సీలు తక్షణ చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరించేలా శ్రద్ధ చూపాలని డిఎస్‌సిడబ్ల్యుఏ రాష్ట్ర అధ్యక్షులు రంగయ్య, ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణుమాధవ్‌తో పాటు కార్యవర్గసభ్యులు ఏజెన్సీ మేనేజర్‌కు అందజేసిన వినతిపత్రంలో కోరారు.



ఈశ్వరా గ్యాస్ ఏజెన్సీ మేనేజర్ వెంకటరమణకు వినతిపత్రం అందజేస్తున్న రంగయ్య

సబ్సిడీపై వాహనాల పంపిణీ

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మార్చి 14, ప్రభాతవార్త : మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాకు చెందిన షెడ్యూల్డ్ కులాల నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించటానికి ఆర్థిక పురోగతి సాధించటానికి ప్రభుత్వం జిల్లా కలెక్టర్, చైర్మన్ ఆదేశాల మేరకు జిల్లా ఎస్సీ యాక్షన్ ప్లాన్ 2025–26కింద సబ్సిడీపై వాహనాలు పంపిణీ చేయటం జరుగుగుతుందని జిల్లా ఎస్సీ కార్పొరేషన్ సంబంధిత అధికారులు పేర్కొన్నారు. లక్ష రూపాయల వరకు ఎలక్రికల్ ద్విచక్రవాహనాలు(90శాతం సబ్సిడీపై), రూ. 3లక్షల విలువగల త్రిచక్ర వాహనాలు ఎలక్ట్రికల్ ఆటో (ప్యాసింజర్, గూడ్స్)వాహనాలు 70శాతం సబ్సిడీపై అందిచనున్నట్లు తెలిపారు. అదే విధంగా రూ. 3లక్షల నుంచి రూ. 7లక్షల వరకు ఉన్న (రూ. 5లక్షల వరకు 60శాతం) సబ్సిడీపై ఆ విలువ గల సోలార్ యూనివర్సల్ పంప్ కంట్రోల్, వ్యవసాయ అనుబంధ భాగాల యూనిట్లను లోన్ల కింద ప్రకటించటం జరిగిందన్నారు. వయస్సు 21నుంచి 50సంవత్సరాల లోపు అభ్యర్థులు ఉపాధి హామీ పథకాలకు 21నుంచి 60సంవత్సరాల వరకు గల అభ్యర్థులు భూసంబంధ, వ్యవసాయ, సోలార్ పరికరాల పథకాలకు ధరఖాస్తులు చేసుకోవాలన్నారు. అభ్యర్థి సంవత్సర ఆదాయం గ్రామీణ ప్రాంతం వారికి రూ. 1.5లక్షలు, పట్టణ మున్సిపల్ వారికి రూ. 2లక్షల వరకు లోపు ఉండాలన్నారు. మీ–సేవ నుంచి పొందిన కుల, ఆదాయ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, ఫుడ్‌సెక్యూరిటీ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ కల్గి ఉండి దారిద్రరేఖకు దిగువన (బిపిఎల్) కల అభ్యర్థులు మాత్రమే ధరఖాస్తులు చేసుకోవాలన్నారు. అర్హత గల ఆసక్తి గల షెడ్యూల్డ్‌కులాల అభ్యర్థులు టిజిఒబిఎంఎంఎస్ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ధరఖాస్తులు నమోదు చేసుకోవచ్చని అన్నారు. నమోదు ప్రక్రియ ఈ నెల 17నుంచి 24వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు జిల్లాలోని ఎస్సి కార్పొరేషన్ కార్యాలయం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో రూమ్ నెంబర్ ఎస్–16 రెండవ అంతస్థులో సంప్రదించవచ్చన్నారు. ఇతర వివరాలకు 040- 24020610నందు సంప్రదించాలని వారు సూచించారు.